## జిల్లా గ్రంథాలయాలన్నింటికీ వెళ్ళనున్న మెహెర్‌బాబా

**రా**ష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో వున్న గ్రంథాలయ సంస్థలకు మెహెర్‌బాబా మాసపత్రిక 2005 సెప్టెంబర్ నుండి 2006 ఆగస్టు దాకా పోస్టు ద్వారా పంపవల్సిందని, అందుకుగాను వార్షిక సభ్యత్వ రూపంలో రూ.1730/- బ్యాంకు డ్రాఫ్టును శ్రీ బి.క్రిష్ణయ్య (ఫోన్ నెం. 040-27897163) రిటైర్డ్ కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, హైదరాబాద్, ఒక చిన్న కానుకగా ఇటీవల పంపారు. **తెలుగు బాబా ప్రేమికులందరి పక్షాన వారికి కృతజ్ఞతలు.**

జై మెహెర్‌బాబా

# ఆనందగీతం

ఆనందం పరమానందం
ఆనందం బ్రహ్మానందం — పల్లవి

మనసు నీవై భారము నీవై
నవచేతనం నీవైనచో - మెహెరుబాబా ॥ఆనందం॥

సఖుడు నీవై గురువు నీవై
ప్రియతముడు నీవైనచో - మెహెరుబాబా ॥ఆనందం॥

హితుడు నీవై సన్నిహితుడు నీవై
నిజరూపం నీవైనచో - మెహెరుబాబా ॥ఆనందం॥

పదము నీవై గీతము నీవై
నవరాగం నీవైనచో - మెహెరుబాబా ॥ఆనందం॥

సత్యము నీవై నిత్యము నీవై
సర్వస్వము నీవైనచో - మెహెరుబాబా ॥ఆనందం॥

వెలుగు నీవై మార్గము నీవై
గమ్యము నీవైనచో - మెహెరుబాబా ॥ఆనందం॥

**-వి.నిరాకారరావు,** హైదరాబాద్

Printed and published and owned by Dasika Prasada Rao printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Prasada Rao**

RNI No. APTEL/2002/7310
Postal Concession : R&D/RNP/HSE-789/2002, Dated 4.9.2002

**PRINTED MATTER**
**BOOK-POST**

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి : 3 | సంచిక: 42 | సెప్టెంబర్ 2005 | పేజీలు: 40

వార్షిక సభ్యత్వం: రూ.75/-

# విజయనగరంలో ప్రేమిక సహవాస్

## సెంటర్ రజతోత్సవాలు, అక్టోబరు 8-9 తేదీలలో

విజయనగరంలో మెహెర్‌బాబా సెంటర్ ఏర్పాటుచేసి రెండున్నర దశాబ్దాలు నిండిన సందర్భంగా అక్టోబర్ 8-9 తేదీలలో రజతోత్సవాలు, ప్రేమిక సహవాస్ పెద్దఎత్తున స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు శ్రీ చాగంటి అఘోరపతి తెలిపారు. ప్రేమిక సహవాస్‌కు హాజరు కాగోరే వారు ముందుగా సెంటర్ కార్యదర్శి శ్రీ చెక్కా త్రినాథ్ 14-2-38, చక్కా వీధి, విజయనగరం, ఫోన్: 9346441150కు తెలియజేయాల్సిందిగా శ్రీ సి.వై.చింతామణి తెలిపారు. కాగా మరిన్ని వివరాలకు శ్రీ అఘోరపతి, విజయనగరం ఫోన్: 08922-275647, సి.వై.చింతామణి, ఫోన్: 252562 లను సంప్రదించగలరని తెలిపారు.

# మిర్యాలగూడాలో మెహెర్ సెంటర్ ప్రారంభం

## అక్టోబర్ 8 ఉదయం 5 గంటలకు

## భావూజీ విచ్చేస్తున్నారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నూతనంగా నెలకొల్పనున్న మెహెర్‌బాబా సెంటర్‌ను అక్టోబర్ 8 తెల్లవారు ఝామున 5 గంటలకు మెహెర్‌బాబా ట్రస్టు చైర్మన్ భావూ కల్చూరీ ప్రారంభిస్తున్నారని నిర్వాహకులు గోపగాని నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంతకాలంగానో మిర్యాలగూడలో మెహెర్‌బాబా సెంటర్ నెలకొల్పాలన్న తమ కోరిక ఇన్నాళ్ళకు నెరవేరబోతోందని నరసయ్య అన్నారు. ఈ సందర్భంగా అక్టోబర్ 8-9 తేదీలలో రెండు రోజులపాటు ప్రత్యేక ప్రేమిక సహవాస్ నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 8వ తేదీ సాయంత్రం 4 నుండి 6 గంటల మధ్య పురవీధుల గుండా పెద్ద ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

హైదరాబాద్ - గుంటూరు మధ్య బ్రాడ్‌గేజ్ రైలు మార్గంలో మిర్యాలగూడ వుంది. హైదరాబాద్ నుంచి 140 కిలోమీటర్ల దూరంలో సుమారు రెండున్నర గంటల ప్రయాణంతో గమ్యాన్ని ప్రేమికులు చేరుకోగలరు. అదే మాదిరిగా గుంటూరు నుంచి మిర్యాలగూడ 140 కిలోమీటర్ల దూరం వుంది. అనువైన బస్సు సౌకర్యం కూడా వుంది. మరిన్ని వివరాలకు గోపగాని నరసయ్య, ఫోన్: 9396611718 లేదా 08689-230019 మిర్యాలగూడాను సంప్రదించగలరు.





# మెహెర్ సందేశం

**Worldly involvements are always full of unnecessary problems and difficulties and are the causes of continuous anxieties.**

● ● ●

**If you snap your connection with the world, you become free of all worries Lord Meher Vol . 3 Page, 785**

ప్రాపంచిక విషయాలు ఎప్పుడూకూడా అనేక సమస్యలు, కష్టాలతో నిండి వుంటాయి. అవి మానవున్ని నిరంతరం ఆందోళనకు గురిచేస్తాయి.

● ● ●

ఈ ప్రాపంచిక విషయాలతో తెగతెంపులు చేసుకోగలిగితే, అన్ని సమస్యలనుండి నీవు దూరంగా వుండగల్గుతావు. మెహెర్‌ప్రభు (లార్డ్‌మెహెర్) వాల్యూం. 3, పేజీ 785


గౌరవ సంపాదకులు:

**మల్లాది కృష్ణానంద్**


### మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19వ తేదీ పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.


వ్యవస్థాపకులు:

**దశిక ప్రసాదరావు**

040-55637210

040-24054791


## లోపలి పేజీలలో...


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | 1954 - అక్టోబరు 7 | 6-11 |
| 3. | కాలేమామ | 12-15 |
| 4. | మురళీ కాలే | 16-17 |
| 5. | లార్డ్ మెహెర్ | 18-22 |
| 6. | అందరి కోసం | 23-26 |
| 7. | మెహెర్‌బాబా ప్రసంగాలు | 27-28 |
| 8. | మస్తులు-బాటసారులు | 29-30 |
| 9. | నను ప్రేమించండి | 31 |
| 10. | డాన్ ఆకస్మిక పర్యటన | 32 |
| 11. | ఉన్నది నీవు మాత్రమే | 34-35 |
| 12. | మామాటలు | 36-38 |


Please visit : www.srimeherbaba.com

# మెహెరాబాద్‌లో స్వర్ణోత్సవాలు

## 2005 నవంబరు 2, 3, 4 తేదీలలో

మెహెరాబాద్‌లో 1955 నవంబరు నెలలో అవతారుడు నిర్వహించిన సహవాస్ కార్యక్రమం నేటికి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నవంబరు 2, 3 తేదీలలో ప్రత్యేక స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమాల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శ్రీ జాల్ పి.దస్తూర్, శ్రీధర్ కోల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 2, 3 తేదీలలో 1955 సహవాస్‌లో అవతారునితో పాల్గొన్న బాబా ప్రేమికులు వారి విశేష అనుభవాల ప్రసంగాలతో పాటు సంగీత భరిత పాటలు - కవ్వాలీలు, నాటిక ప్రదర్శనలు ఈ సందర్భంగా ఏర్పాటు చేసినట్లు శ్రీ జాల్ తెలిపారు. ముందుగా నవంబర్ 2, 3 తేదీలకే ఈ సహవాస్ కార్యక్రమ నిర్వహణ పరిమితం చేయాలని భావించినా, ట్రస్టు చైర్మన్ భావూజీ సూచనల మేరకు నవంబర్ 4న 'గాడ్‌స్పీక్స్'పై మెహెరాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ జాల్ తెలిపారు. భగవద్వచనం (గాడ్ స్పీక్స్) ప్రచురించి 50 సంవత్సరాలు నిండిన శుభ సందర్భంగా, భగవద్వచనంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కాగోరు ఆసక్తిగల బాబా ప్రేమికులు మెహెరాబాద్‌లో తగిన ఏర్పాట్లు చేయునిమిత్తం తమ పేర్లు, అడ్రస్సు వివరాలతో ముందుగా రిజర్వు చేయించుకుని తమకు సహకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు. ముంబాయి సెంటర్ ప్రేమికులచే నవంబరు 5వ తేదీ మధ్యాహ్నం ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శన కూడా ఏర్పాటు చేశామన్నారు.

**మరిన్ని వివరాలకు:** Alternate email: jaimeher-anr-sancharnet.in, Meherabad Trust Office, Phone: +91-241-2548777, Post Meherabad, Near Arangon, Ahemadnagar District, Maharashtra State, India - 414 006 ను సంప్రదించగలరు.

### రాజగోపాలుని చొరవ..

ఎ.ఎన్. రాజగోపాల్, బెంగుళూర్, సుమారు 40 మందికి ఒక ఆరు నెలలపాటు మెహెర్‌బాబా మాసపత్రిక పంపవల్సిందని రూ.1500/- బ్యాంకు డ్రాఫ్టుతో పాటు మన దేశంలో పలు ప్రాంతాల్లో వున్న ఆయన బంధుమిత్రుల అడ్రస్సులు పంపారు. ఆరు నెలల తర్వాత, వారికిష్టమైతే వారే తమ సభ్యత్వం కొనసాగించగలరని నేనాశిస్తున్నాని ఆయన ఒక లేఖ వ్రాశారు. మన బంధు - మిత్రులకు - ముఖ్యంగా క్రొత్తవారికి 'మెహెర్‌బాబా' మాసపత్రిక పంపగల్గితే- బాగుంటుందని మేం కొంత కాలంగా సూచిస్తున్నాం బహుశా -మా విజ్ఞప్తి మేరకు శ్రీ రాజగోపాల్ చొరవ తీసుకున్నారని భావిస్తున్నాం. వీరి స్ఫూర్తి మరికొందరికి ఆదర్శం కావాలని మా అభిలాష.





**సంపాదకీయం**

# మంచి అవకాశం

అవతారుని సన్నిధానంలో, ఆయనకు అత్యంత సన్నిహితంగా వున్న బాబా ప్రేమికులు భావూజీ.

అవతారుడు జరిపిన అనేక పర్యటనలలో, సహవాస్ కార్యక్రమాలలో, అలాగే God speaks, Discourses, Listen Humanity వంటి మహోత్కృష్టమైన ఆధ్యాత్మిక గ్రంథాలు అవతార్ మెహెర్‌బాబా రాసిన సందర్భాల్లో ఆయన్ని వెన్నంటి వున్న అదృష్టశాలి భావూజీ. ఈ యుగావతారుడు అవతార్ మెహెర్‌బాబా స్వయంగా తనకోసం ఎంపిక చేసుకున్న భాగ్యశాలి భావూజీ.

భావూజీ అక్టోబర్ 8,9, తేదీలలో నల్గొండ జిల్లా మిర్యాలగూడాకు, అక్కడ మెహెర్‌బాబా సెంటర్ ప్రారంభోత్సవానికి -ప్రేమిక సహవాస్‌లో పాల్గొనడానికై వస్తున్నారు.

ఇకపోతే, 1955 నవంబరు లో మెహెరాబాద్‌లో నిర్వహించిన సహవాస్ కార్యక్రమం మెహెర్‌బాబా రాసిన God speaks గ్రంథం ప్రచురించి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మెహెరాబాద్‌లో నవంబరు 2,3,4, తేదీలలో ప్రత్యేకంగా స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నారు.

1955 నవంబరులో మెహెరాబాద్ సహవాస్‌లో పాల్గొన్న బాబా ప్రేమికులు, అవతారునితో సన్నిహితంగా సుమారు ఒక వారం రోజులు మెహెరాబాద్‌లో వుండటమే కాదు - మెహెరుడి ఆతిధ్యం వారు అనుభవించారు. ఈ కోవకు చెందిన మెహెరుడి ప్రత్యేక అతిథులు నేడు వయస్సు రీత్యా పెద్ద వాళ్ళై, మన మధ్యన చాలా కొద్ది మంది మాత్రమే మిగిలారు. ఆ కొద్ది మంది తమ విశేష అనుభవాలు తెలియజేసే ఒక వినూత్న ప్రేమిక సహవాస్ మెహెర్‌బాబా ట్రస్టు సభ్యులు నవంబరు 2,3, తేదీలలో మెహెరాబాద్‌లో స్వర్ణోత్సవ సంబరాలుగా ఏర్పాటు చేశారు.

తెలుగు బాబా ప్రేమికులు అక్టోబర్ 8,9, తేదీలలో భావూజీ రాక సందర్భంగా మిర్యాలగూడాకు, నవంబరు 2,3,4,లలో మెహెరాబాద్‌కు వెళ్ళే ప్రయత్నాలకు ఇప్పటి నుండి తగిన ఏర్పాట్లు చేసుకోవడం ఉభయకుశలోపరి.

మెహెరుని సేవలో ఇదొక మహత్తర అవకాశం సుమీ!!

**-మల్లాది**

# స్మరించుకునే వేళ

# 1954 అక్టోబరు 7

*మెహెర్‌బాబా ప్రేమికులు - అక్టోబరు ఏడవ తేదీని చాలా ముఖ్యమైన రోజుగా భావిస్తారు. అదేమంటే, 1954 అక్టోబరు ఏడవ తేదీనాడు మెహెర్‌బాబా అప్పటి దాకా వాడుతున్న అక్షరఫలకాన్ని వదిలివేశారు. ఆ ముఖ్యమైన రోజుని స్మరించు కుంటూ - ఆనాటి సంఘటన వివరాలను ఒకసారి గుర్తుచేసుకునేందుకై - ఈ వ్యాసం ప్రచురిస్తున్నాం. దయచేసి పరిశీలించండి. లార్డ్ మెహెర్ వాల్యూం.13, పేజి.4555 -4560 ఆధారంగా* **-ఎడిటర్**

1954 అక్టోబరు ఆరవ తేదీన 20 మంది మండలి సభ్యులతో కలిసి మెహెర్‌బాబా సతారాలో బసచేసి వున్నారు. అక్టోబరు ఆరవ తేదీ నుండి ఏడవ తేదీ అర్ధరాత్రి దాకా, తనతో సహా ఆరవ తేదీన మండలి సభ్యులందరూ మెళుకువగా వుండాలని బాబా అన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుండి అర్ధరాత్రి దాకా అందరూ కేవలం మంచినీళ్ళు త్రాగుతూ ఉపవాసం ఉండాలని, అర్ధరాత్రి దాటాక ఒంటి గంటకు కాఫీ త్రాగవచ్చని బాబా అన్నారు. ఏడవ తేదీ ఉదయాన్నే ఆరు గంటలకల్లా కాలకృత్యాలు పూర్తిచేసుకుని స్నానం చేసి, సతారాలో వుంటున్న రోజ్‌వుడ్ బంగళాలో సిద్ధంగా వుండాలని తన ప్రేమికులను బాబా ఆదేశించారు.

అక్టోబరు 7వ తేదీ నాటికి సతారాకు రావాల్సిందిగా అహ్మద్‌నగర్‌లో వుంటున్న ధాకే ఫాల్కర్‌కు కబురు పంపారు. బాబా సోదరుడు జాల్ కూడా పూనే నుండి సతారాకు అక్టోబరు 7వ తేదీ ఉదయానికల్లా చేరుకున్నాడు.

1954, అక్టోబరు ఏడవ తేదీ దసరా పండుగయ్యింది. హిందూ పండగల ఆచారం ప్రకారం రోజ్‌వుడ్ బంగళాను రంగు రంగుల పూలతో అలంకరించిన షేబా గుర్రాన్ని బాబా కోరిన





మీదట తీసుకొచ్చారు.

అక్టోబరు ఏడవ తేదీ షిరిడీ సాయిబాబా భౌతిక దేహం త్యాగం చేసిన రోజు కూడా. మెహెర్‌బాబా ఈ సందర్భంగా షిరిడీ సాయి సంస్థాన్‌కి ఒక టెలిగ్రాం పంపారు.

""THE ANCIENT ONE AVATAR MEHER BABA, SENDS HOMAGE TO SAI BABA, THE GURU, GOD - INCARNATE, SAI BABA."

అని బాబా తంతి పంపారు.

డెహ్రాడూన్‌లో వెటర్నరీ డాక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్.ఆర్.పాల్ శర్మ కూడా సతారాకు వచ్చారు. డా॥ శర్మ తొలిసారిగా డెహ్రాడూన్‌లో బాబాను నవజీవన కార్యక్రమంలో వుండగా దర్శించుకున్నాడు. ఆ దరిమిలా మెహెరాబాద్ సమావేశాలకు డా॥ శర్మ హాజరయ్యారు.

ఇంకా - ఇలా చాలామంది బాబా ప్రేమికులు అక్టోబరు 7వ తేదీన బాబాను దర్శించుకోడానికి సతారా వచ్చారు. ఆదీ-రోడా దుబాషీ కరాచీ నుండి వచ్చారు.

వీరిని ఉద్దేశించి బాబా మాట్లాడుతూ - గత మూడు నెలలుగా నేను స్నానం చేయలేదు. ఈ రోజే తలంటి స్నానం చేశాను. కాబట్టి - నా ఆలింగనం కోసం కొద్దిసేపు ఆగమని - బాబా వారితో అన్నారు. ఆ తర్వాత రోడా దుభాషీని పంపివేసి, రోజ్‌వుడ్ బంగళాలో ఆదీని మాత్రం వుండమని బాబా ఆదేశించారు. ముందుగా పేర్కొన్నట్లు అక్షర ఫలకం త్యజిస్తున్న ప్రత్యేక సమావేశంలో ఆదీని పాల్గొనమని బాబా కోరారు.

ఏదో పనిమీద సో॥ జాల్ పూనేకి ఆరోజు మధ్యాహ్నం 1.30 ని॥ వెళ్ళిపోయాడు. ఎంతో ముఖ్యమైన ఈరోజు కార్యక్రమంలో పాల్గొనకుండా పూనే వెళ్ళిపోయిన జాల్ ఎంతో దురదృష్టవంతుడని బాబా వ్యాఖ్యానించారు.

రోజ్‌వుడ్ బంగళాకు బాబా కరెక్టుగా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వచ్చారు. బాబాతో పాటు కుమార్, అలోబా, భావూజీ వున్నారు. సతారాలోనే బాబా - తన స్త్రీ మండలి సభ్యులతో కలిసి "గ్రాఫ్టన్ బంగళా"లో వున్నారు. పురుష మండలి వారు రోజ్‌వుడ్ బంగళాలో వుంటున్నారు. ఇక్కడి పురుష మండలి సభ్యుల కోసమని బాబా రోజుకు రెండు దఫాలు వచ్చి వెళ్తున్నారు.

బాబాతో పాటు మూడు అక్షర ఫలకాలు తీసుకొచ్చారు. ఆ మూడింటిలో ఒకటి ప్లేవుడ్‌తో తయారు చేసింది. మరొక అక్షర ఫలకం ప్లాస్టిక్‌తోను- మరొకటి కార్డ్ బోర్డుతో తయారు చేసింది.

బాబా ప్లేవుడ్ అక్షర ఫలకాన్ని కుమార్‌కు బహూకరించారు. ప్లాస్టిక్ అక్షర ఫలకాన్ని ధాకేకి అందజేశారు. కార్డ్ బోర్డుతో చేసిన మూడవ అక్షర ఫలాకాన్ని బాబా అమిత ప్రేమగా తనతో చాలా ఎక్కువ కాలం ఉపయోగించారు. ఈ అక్షర ఫలకంపై 'సున్న' అంకె కొంత భాగం చిరిగి వ్రేలాడుతోంది.

ఈ అక్షర ఫలకాన్ని నేను చాలాకాలంగా వాడుతున్నాను. కాబట్టి– ఈ బోర్డుకున్న 'సున్న'– అంకెలో కొంత భాగం చిరిగి పోయింది అని అన్నారు.

Baba remarked - ""I have been using this board quite roughly and still the zero is suspended to it. Due to a broken piece, three - fourths of the zero on the board is wiped out, one-fourth is saved. If this dangling piece seperates from the board, it will be best for the world."

అలా అంటూ బాబా ఆ అక్షర ఫలకాన్ని సేవక్ కొత్వాల్ వైపు విసిరారు. దాంతో ఆ 'సున్న' వున్న ముక్క కాస్తా పూర్తిగా విరిగిపోయింది.

ఆ తర్వాత అక్షర ఫలకాన్ని ఏరుచ్‌కి ఇచ్చి మెహెరాబాద్‌లో వుంటున్న పాద్రికి పంపి, చాలా భద్రంగా దాచిపెట్టమని ఆదేశించారు. కేవలం భగవంతునికి మాత్రమే – ఆ సున్నకున్న విలువ, ప్రాధాన్యం ఏమిటో తెలుసునని– బాబా వ్యాఖ్యానించారు.

విరిగిపోయిన ఆ సున్న ముక్కను సేవక్‌కు అందజేస్తూ – నీ చివరి క్షణం వరకూ – జాగ్రత్తగా భద్రపరచమని బాబా ఆదేశించారు. అక్టోబరు 8వ తేదీ నుండి తాను అక్షరఫలకం ఉపయోగించనని ప్రకటించారు.

ఆ రోజు సాయంత్రం 5.30 ని॥లకు బాబా సేవక్‌ను పిల్చి – అంత క్రితం తాను ఇచ్చిన "సున్న" ఎక్కడ దాచావు అని ప్రశ్నించారు.

నా ట్రంకు పెట్టెలో పెట్టానని సేవక్ జవాబిచ్చాడు. నేను కనుక నీ స్థానంలో వుండి వుంటే, నా శరీరంలో కొంత మాంసం ముద్ద తొలగించి, ఈ సున్నను అక్కడ భద్రపరచి వుండేవాడినని బాబా – సేవక్‌తో అన్నారు.

నీకు నిజంగా ఆ 'సున్నా' కావాలా? అని తిరిగి సేవక్‌ను బాబా ప్రశ్నించారు.

నాకు ఆ సున్న ప్రాధాన్యం తెలియలేదని సేవక్ ప్రాధేయపడ్డాడు.

ఆ సున్నా ముక్క ఘోర కలి సృష్టించగలదని – బాబా హెచ్చరించారు.

అయితే, ఆ సున్నతో నాకేం పనిలేదు. నీకే తిరిగి ఇచ్చేస్తానని సేవక్ – బాబాకు ఆ సున్నా ముక్కను తిరిగి ఇచ్చేశాడు.

సేవక్ తిరిగి ఇచ్చేశాక – ఎంతో ప్రాముఖ్యం గల ఆ భాగాన్ని తిరిగి ఇచ్చివేసిన నీవు మందమతివి అని బాబా హేళన చేశారు.

అంతలోనే నవ్వుతూ – ఆ 'సున్న' నాకు కావాలి. సేవక్ స్వచ్ఛందంగా నేను అడక్కుండానే నాకిచ్చేశాడని బాబా నవ్వుతూ అన్నారు.

ఈ సున్న ముక్కను కూడా ఏరుచ్‌కి అందజేస్తూ అక్షర ఫలకంతో పాటు సున్నా కూడా చాలా భద్రంగా దాచమని మెహెరాబాద్‌లో వుంటున్న పాద్రికి కబురు చేయమని బాబా ఏరుచ్‌ని ఆదేశించారు.

సాయంత్రం ఆరు గంటలకు బాబా వారిని ఉద్దేశించి ప్రసంగించారు.





ముందుగా వెళ్ళి కాళ్ళూ – చేతులూ కడుక్కోమన్నారు. తమ ప్యాంటు లోపల కూడా కొన్ని నీళ్ళు చిలకరించుకోమన్నారు. ఎందుకంటే మూత్రం చేసినప్పుడు ఒక్కోసారి కొన్ని చుక్కలు శరీరంపై పడే అవకాశం వుందన్నారు.

ఈ సమావేశ సమయంలో ఈ క్రింది 20 మంది సభ్యులున్నారు.

గుస్తాద్‌జీ, బైదుల్, కాకాబారియా, పెండూ, విష్ణూ, ఏరుచ్, రంజూ, డాంకిన్, నీలూ, సేవక్ కొత్వాల్, కైకోబాద్, కృష్ణనాయర్, భావూజీ, అలోబా, కిషన్‌సింగ్, కుమార్, ధాకే, ఆదీ దుభాష్, డా॥ శర్మ, కృష్ణాజీ.

పైన పేర్కొన్న ప్రేమికులందరూ నీళ్ళతో శరీర భాగాలను శుభ్రపరుచుకున్నాక, తలుపులు మూసివేశారు. లోపలికి ఎవరూ అనుమతి లేకుండా ప్రవేశించకుండా బయట కాపలాదారులను నియమించారు. ఆ తర్వాత బాబా మాట్లాడుతూ, నేను ఈ రోజు అక్షర ఫలకాన్ని వదిలి పెట్టాలని, ఇకపై దాన్ని ఉపయోగించరాదని నిశ్చయించాను. ఆ పని చేసేముందర, పంచ సద్గురువులకు నేను నా ప్రణామములు అర్పించదల్చానని అన్నారు.

సాయంత్రం ఆరున్నర గంటలకు బాబా పంచ సద్గురువులకు ప్రణామములు అర్పించే కార్యక్రమం ప్రారంభమైంది. ముందుగా ఏరుచ్ ఇంగ్లీషులోను, భావూజీ హిందీలో ఈ క్రింద ఇచ్చిన ప్రార్థన చదివారు. బాబా అంత క్రితం రోజుననే ఈ ప్రార్థనను ఏరుచ్‌కి డిక్టేట్ చేశారు.

ఆ ప్రార్థన ఇలా వుంది

O Sai Baba, Upasni Maharaj, Babajan,
Tajuddin Baba and Narayan Maharaj!
You, the five in One and the One in five,
the Divine Beings representing the Absolute One,
I now bow to you in perfect homage.
It is due to you, the five Men-God, that I am what I am -
the Ancient One, the Everlasting One!
May the Beloved God, with Whom you five are One
and for Whom you five are working universally,
give me in your names, the strength, power and wisdom
to fulfill all that I have taken this form for,
and see that all I have declared
at the last Meherabad meeting comes to pass.
I now give up using the board, it being my gesture before God
for breaking my silence soon.

ఆ తర్వాత తెల్లని దుప్పటి లాంటిది నేలపై పరిచారు. ఒక చిన్న స్టూలు తీసుకొచ్చి దుప్పటిపై వుంచారు. అక్కడ సమావేశమైన 20 మందిని ఒక్కొక్కరే తనకు దగ్గరగా వచ్చి ఆ స్టూలుపై నిలుచోవలసిందిగా ఆదేశించారు. నా నుదిటి భాగం మీ పాదాలను తాకినప్పుడు మీరు – ఓ సాయిబాబా, ఉపాసనీ మహారాజ్, బాబా జాన్, తాజుద్దీన్ బాబా, నారాయణ్ మహారాజ్ –!! అని పంచ సద్గురువుల పేర్లను గట్టిగా, బిగ్గరగా పిలవాలి. అలా పిలుస్తూ, బాబా మీకు తన ఆఖరి ప్రణామములు అందజేస్తున్నాడు అని ప్రకటించాలని బాబా ఆదేశించారు.

పంచ సద్గురువుల పేర్లు పైన చెప్పిన క్రమంలోనే, తాను సూచించిన రీతిలోనే వుండాలని బాబా హెచ్చరించారు.

బాబా ఆదేశాల ప్రకారం మండలి వారందరూ ఒక్కొక్కరే వరుసగా వచ్చి స్టూలుపై నిల్చునుండగా బాబా వారి పాదాలకు తన నుదిటిని ఆనించారు. ప్రతి ఒక్కరూ బాబా ముందుగా చెప్పినట్లు పంచ సద్గురువుల పేర్లను గట్టిగా ఉచ్చరించారు. పంచ సద్గురువుల పేర్లను ఉచ్చరించడంలో బాబా ఇచ్చిన వరుస క్రమం ఎవరైనా తప్పితే – తిరిగి మొదటి నుంచి ఆయా పేర్లను ఉచ్చరించాలని బాబా ఆదేశించారు.

కృష్ణనాయర్ తప్పు చెప్పడంతో – కనీసం ఆతనిచేత ఐదారుసార్లు ఆ పేర్లను చెప్పించారు. గుస్తాద్‌జీ మౌనంగా – ఈ కార్యక్రమం ప్రారంభించగా, (*బాబా ఆదేశాల మేరకు గుస్తాద్‌జీ చాలా కాలంగా మౌనంలో వున్నారు) కైకోబాద్‌తో ఈ కార్యక్రమం ముగిసింది. అందరూ పూర్తయ్యాక, బాబా బాగా వంగి, చేతులను, నుదుటిని, పాదాలను తాకుతూ, తనకు తాను నమస్కరించుకున్నారు.

బాబా మౌనంలో వున్నారు కాబట్టి పంచ సద్గురువుల పేర్లను గట్టిగా ఉచ్చరించమని మండలి వారిని బాబా కోరారు. అందరూ ఒక్కసారిగా గట్టిగా పిలవలేకపోవడంతో బాబా తాను తన చూపుడు వేలు చూపించినప్పుడు అందరూ సద్గురువు పేరును ఒక్కసారిగా పిలవాలని సూచించారు. అదెలాగంటే మొదటిసారి బాబా వేలు చూపినప్పుడు – 'సాయిబాబా' అని గట్టిగా అరిచారు. రెండవసారి – ఉపసానీ మహారాజ్ – అని వరుసగా పంచ సద్గురువులలో ఒక్కొక్కరి పేరు గట్టిగా ఉచ్చరించారు.

ఇదంతా అయినాక బాబా తన చేతులు కడుక్కుని, గుస్తాద్‌జీ కైకోబాద్‌లను తన ఎదుట నిలుచోమన్నారు. ఆ తర్వాత బాబా వారిద్దరి మధ్యన – వారితో చేతులు కల్పుతూ నిల్చుని – ఏరుచ్‌ని ఇంగ్లీషులో భావూజీ హిందీలో ఒక్కొక్కరు రెండు దఫాలుగా ముందుగా చెప్పిన ప్రార్థనను చదవమన్నారు. అలా ప్రార్థన చదువుతున్నప్పుడు – బాబా తన రెండు చేతులు ఎత్తి పట్టుకుని, తానే స్వయంగా ఆ సర్వేశ్వరుడ్ని ప్రార్థిస్తున్నట్లు కన్పించారు.

ఆ తర్వాత బాబా ముందుగా గుస్తాద్‌జీకి వంగి నమస్కరించారు. ఆఖరిగా కైకోబాద్‌కు నమస్కరించారు.





ఈ దఫా – బాబా మండలి వారి పాదాలకు నమస్కరిస్తున్నప్పుడు **పరబ్రహ్మ, పరమాత్మ, యాయాజ్‌దాన్, అహూర్మజదా, అల్లాహో అక్బర్** అని గట్టిగా పిలవాలని ఆదేశించారు. ఆ తర్వాత ఇదంతా పూర్తయ్యాక అక్కడుంచిన స్టూలుకు బాబా శిరస్సు వంచి నమస్కరించారు. ఈ సమయంలో అందరూ కోరస్‌గా పరబ్రహ్మ – పరమాత్మ.. అని బిగ్గరగా ఆలాపించారు.

సాయంత్రం 6.45 ని॥లకు బాబా తన చేతులు కడుక్కున్నారు. ఒక నీళ్ళ గిన్నెను స్టూలుపై వుంచారు. బాబా శుభ్రంగా చేతులు కడుక్కున్నాక, ఏడుసార్లు నేలపై నీళ్ళను చిలకరించారు. ఇలా చేశాక, తిరిగి తన యథాస్థానంలోకి వెళ్ళి, తిరిగి స్టూలుపై వున్న నీళ్ళ గిన్నెలోంచి నీళ్ళు తీసుకుని నేలపై ఏడుసార్లు చిలకరించారు. దీంతో తన పని పూర్తయినట్లు సంతృప్తి చెందినట్లు బాబా కన్పించారు. బాబా కళ్ళలో దైవీకాంతి కొట్టొచ్చినట్లు కన్పించింది. ఒక ప్రత్యేకమైన తృప్తి ఆయన కళ్ళలో కన్పడింది.

ఆ దరిమిలా బాబా గుస్తాద్‌జీ ఎదుట చేతులు కట్టుకుని నిల్చున్నారు.

ఆ తర్వాత ఏరుచ్‌ని తిరిగి ప్రార్థన రెండు దఫాలు చదవమన్నారు. భావూజీని ఒక్కసారి మాత్రం చదవమన్నారు.

అప్పుడు బాబా తన సీట్లో కూర్చున్నారు. సరిగ్గా సాయంత్రం 7 గంటలకు కార్డ్‌బోర్డుతో చేసిన అక్షర ఫలకం – చిరిగిపోయిన సున్న అక్షరంతో సహా స్టూలుపై వుంచారు. ఆ తర్వాత అక్షరఫలకాన్ని – సున్నా అక్షరంతో సహా ఈ కార్యక్రమ సమయంలో తాను నిల్చున్న తెల్లని దుప్పటిని పాద్రీకి అందజేసి భద్రపరచమని ఆదేశించారు.

ఇదంతా అయిపోయాక బాబా కొద్దిసేపు ప్రశాంతంగా కూర్చున్నారు. ఎంతో చక్కని వాతావరణం – హాయిగొల్పేలా వుంది. ఇంతలో – **"నేను ఎంతో ఆనందంగా ఉన్నాను" అని బాబా అన్నారు. నేనెంత సంతోషంగా వున్నానో – మీరు ఊహించలేరు అని ఆయనే తిరిగి అన్నారు.**

ఆ రోజు రాత్రి 11.30 ని॥ల దాకా భజనలు – కవ్వాలీ పాటల రికార్డు బాబా ఆలకించారు. రాత్రి 11.45 ని॥లకు ఏరుచ్ ఇంగ్లీషులో ప్రభుస్తుతి పఠించారు. భావూజీ హిందీలో ప్రభుస్తుతి చదివారు. ఈ ప్రార్థనలు పూర్తయ్యే సరికి అర్ధరాత్రి దాటింది. మండలి సభ్యులందరూ బాబాతో కల్సి ఆయన బసచేసిన గ్రాఫ్టన్ బంగళాకు వెళ్ళారు.

ఆ మాదిరిగా బాబా 1954 అక్టోబరు 7వ తేదీన అక్షర ఫలకం వదిలిపెట్టారు. అప్పట్నుంచి అవతారుని మౌన సంభాషణ ఎలా కొనసాగిందో ఆయన ప్రేమికులందరికీ సుపరిచితమే.

**ఈ మృదు మధుర క్షణాలు స్మరించుకునేలా 2005 అక్టోబర్ 7వ తేదీన ప్రతి బాబా సెంటర్‌లో ఏదేని కార్యక్రమం నిర్వహించాలను కోవడం – అభిలషణీయం.**

అరుదైన సమాచారం

# కాలేమామ

- మల్లాది కృష్ణానంద్

**రామచంద్ర బాపూజీ కాలే - ఈయన్నే క్లుప్తంగా 'కాలేమామ' - అని బాబా మండలి సభ్యులు - బాబా ప్రేమికులు పిలుస్తారు.**

**కాలేమామ గొప్ప సివిల్ ఇంజనీరు. రాచరికపు కుటుంబంలో జన్మించిన శ్రీమంతుడు. 1926 ప్రాంతంలో అవతారుని మండలి సభ్యునిగా చేరి - తన సర్వస్వం ఆయనకి అర్పించిన ధన్యజీవి.**

**అంతేకాదు, కాలేమామ - షిరిడీలో సాయినాథుని, సాకోరీలో ఉపాసనీ మహారాజ్‌ని, ఖేడ్గాంలో నారాయణ్ మహారాజ్‌లను నేరుగా కల్సి వారి ఆశీస్సులు అందుకున్న భాగ్యశాలి.**

**1939లో మహారాష్ట్రలోని పంచాగ్ని ప్రాంతంలో వుంటున్న తన కుమార్తె ఇంట కొంత కాలం విశ్రాంతి తీసుకుంటూ తన పాత జ్ఞాపకాలను కాలేమామ ఒక డైరీలో పొందుపరిచారు. కాలేమామ మరాఠీలో రాసిన ఆ డైరీలోని అంశాలను ఆయన మనుమడు నికేత్‌కాలే www.trustMeher.com లో పదిలపరిచారు.**

**కాలేమామకు ఇద్దరు కుమారులు.**

**ఒకరు మురళీ కాలే -**

**మరొకరు శ్రీధర్ కాలే!!**

**మురళీ కాలే ఏకైక కుమారుడు నికేత్ కాలే!!**

**నికేత్ కాలే ప్రస్తుతం జబల్‌పూర్‌లో బాబా సెంటర్ నిర్వహిస్తున్నారు.**

**కాలేమామ వారసునిగా ఆయన మనుమడిగా, నికేత్ కాలేతో సంప్రదించి వారితో లిఖిత అనుమతిని ముందుగా తీసుకుని కాలేమామకు సంబంధించి పలు విశేష ఆసక్తికర విషయాలను మెహెర్‌బాబా సంచిక పాఠకుల కోసం ప్రత్యేక వ్యాసంగా ప్రచురిస్తున్నాం. దయచేసి పరిశీలించండి. స్పందించండి.**

● ● ●

కాలేమామ 1926 ప్రాంతంలో అవతార్ మెహెర్‌బాబాను తన ఇష్టదైవంగా భావించి, ఆయన మండలి సభ్యునిగా అహ్మద్‌నగర్ జిల్లాలో గల మెహెరాబాద్‌కు తన భార్య-పిల్లలతో సహా వచ్చి చేరారు.

తన ఇద్దరు కుమారులు మురళీ కాలే - శ్రీధర్ కాలేలను 1927వ సంవత్సరంలో మెహెర్‌బాబా నిర్వహించిన ప్రేమాశ్రమ స్కూలులో చేర్పించారు. మెహెర్‌బాబా నెలకొల్పిన హజ్రత్ బాబాజాన్ స్కూల్లో చేరిన తొలి పదిమంది విద్యార్థుల్లో కాలేమామ ఇద్దరు కుమారులూ





ఉండడం పేర్కొనదగ్గ విషయం.

మురళీకాలే - అవతారుడు జరిపిన నవజీవనంలో కూడా పాల్గొని, అవతారుని ప్రశంసలు సయితం అందుకున్నారు. కాలేమామ మెహెరుడ్ని దర్శించుకోవడానికి పూర్వం - షిరిడిలో సాయినాథుని దర్శించుకున్నాడు. ఆయన ఆశీస్సులు అందుకున్నాడు.

కాలేమామ కొల్హాపూర్ నివాసి. ఆయన తండ్రి బాపూజీ కాలే - కొల్హాపూర్ రాజాస్థానంలో మంత్రిగా పన్జేసేవారు. కాలేమామ మహారాష్ట్ర విశ్వవిద్యాలయం నుంచి సివిల్ ఇంజనీరింగ్ పట్టా పొందారు. అనంతరం కొల్హాపూర్ మునిసిపల్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కొంతకాలం పన్జేసారు. అలాగే, అక్కల్‌కోట సంస్థానం, పండరీపురం, ధూలే- మున్సిపల్ కార్పొరేషన్‌లలో సివిల్ ఇంజనీర్‌గా పన్జేశారు. పండరీపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో 1910-1911లో కార్పొరేషన్ సెక్రటరీగా కాలేమామ పన్జేశారు. ఆ సమయంలోనే తన మిత్రుల ద్వారా షిరిడి సాయిబాబా గురించి తెలుసుకుని షిరిడీకి వెళ్ళి సాయిబాబాను దర్శించుకున్నారు. మరో సందర్భంలో - తన తోటి అధికారుల సలహా మేరకు - తన సోదరుడు - అన్నా కాలే వివాహ సంబంధం కోసమని షిరిడీ వెళ్ళారు. అలా వెళ్ళిన కాలేమామ తమ బసలో సామాన్లు పెట్టి, తన అన్నగారితో కలిసి షిరిడిలో సాయిబాబా వుంటున్న మసీదు ప్రాంతానికి నేరుగా వెళ్ళారు.అది మధ్యాహ్న సమయం.

మసీదులో సాయిబాబా ఒంటరిగా వున్నారు. కాలేమామ సాయినాథునికి భక్తితో

పాదాభివందనం చేశారు.

సాయిబాబా తనకు రెండు రూపాయలు ఇవ్వమని కాలేమామని అడిగారు. అందుకు తన జేబులో వున్న రెండు రూపాయలు తీసి సాయిబాబాకి ఇచ్చారు. దాంతో ఊరుకోకుండా, సాయిబాబా నాకు మరో నాలుగు రూపాయలు ఇవ్వమని అడిగారు.

కాలేమామ జేబులో ఇక ఏమాత్రం డబ్బుల్లేవు. ఆయన జేబులో వుంది – కేవలం ఆయన సూట్‌కేసు తాళాలు మాత్రం వున్నాయి. ఆ తాళం చెవులు సాయినాథుని చేతిలో పెట్టి, తన అన్నగార్ని తమ బసకు వెళ్ళి, సూట్‌కేసులో వుంచిన డబ్బు తీసుకురమ్మని పంపాడు. దీంతో సాయిబాబా చాలా సంతోషించాడని కాలేమామ తాను రాసుకున్న డైరీలో ఈ విషయాలు పొందుపరిచారు. తన అన్నగారు తీసుకొచ్చే డబ్బుల కోసం ఎదురు చూస్తూ, సాయిబాబా సమక్షంలోనే వున్న కాలేమామ నుద్దేశించి “నీవు మాలో ఒకడివి” అని సాయిబాబా చాలా స్పష్టంగా మరాఠీలో అన్నారని కాలేమామ తన డైరీలో పేర్కొన్నారు. అంతేకాదు – “తిరిగి మళ్ళీ ఎప్పుడు వస్తావ్” (TUMHI TAR AMCHYAT LE - ""PUNHA KEVHA YENAR) అని మరాఠీలో సాయిబాబా అడిగారు. అందుకు “నీవు ఎప్పుడు దయతలిస్తే అప్పుడు తప్పక రాగలను” – బాబా అని కాలేమామ తడుముకోకుండా జవాబిచ్చారట. ఇంతలో తన అన్నగారు నాల్గు రూపాయలు తీసుకొస్తే – వాటిని సాయిబాబాకు అందజేశామన్నారు. కొద్దిసేపు సాయిబాబా సమక్షంలో ఉండి – ఆ తర్వాత తమ బసకు చేరామని, ఆ దరిమలా బాబా అన్న మాటలు తన పనిలో పడి మరచిపోయానని – మెహెరుని చెంతకు చేరాక – సాయిబాబా మాటలకు అర్థం తెలిసొచ్చిందని కాలేమామ పేర్కొన్నారు.

1917వ సంవత్సరంలో అక్కల్‌కోట సంస్థానంలో పన్జేస్తూ – ఇక అక్కడ్నుంచి తన పదవీ

**www.trustMeher.com**

**అవతార్ మెహెర్‌బాబా సమాచారం తెలియజేస్తూ సుమారు ఆరు వేల పైచిలుకు వెబ్‌సైట్‌లు ప్రస్తుతం ఇంటర్‌నెట్‌లో కన్పిస్తున్నాయి. అయితే www.trustMeher.com వెబ్‌సైట్‌లో మెహెర్‌బాబా గురించి సమగ్ర సమాచారం పొందుపరిచారు అని చెప్పొచ్చు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్‌పూర్‌లో వుంటున్న కాలేమామ మనుమడు నికేత్ కాలే, ట్రస్ట్ మెహెర్ వెబ్‌సైట్ నిర్వహిస్తున్నారు. ఇటీవల మెహెర్‌బాబా మాసపత్రిక ప్రతినిధి ఒక సమాచారం నిమిత్తం ఆయన్ని సంప్రదించడం జరిగింది. ఈ సందర్భంగా నికేత్ కాలే తెలుగు బాబా ప్రేమికులను www.trustMeher.com వెబ్‌సైట్‌ను ఒక్కసారైనా విజిట్ చేయమని ఆహ్వానించారు. ‘ట్రస్ట్ మెహెర్’ ప్రతినెలా ఒక న్యూస్‌లెటర్ కూడా ప్రచురిస్తోంది. ఆ న్యూస్ లెటర్‌ను ఆయా ప్రాంతాల్లోని తెలుగు బాబా ప్రేమికులు తగిన సమాచారం పంపితే, వారి న్యూస్ లెటర్‌లో ప్రచురించగలమని నికేత్ కాలే అన్నారు.** ●





బాధ్యతలు వదలిపెట్టి కొల్హాపూర్‌లో స్థిరపడాలని కాలేమామ నిశ్చయించుకున్నారు. ఆ మాదిరిగా అక్కల్‌కోట నుంచి – కొల్హాపూర్ – స్వగ్రామం వెడుతూ, దారిలో వచ్చే ‘ఖేడ్గాం’ గ్రామంలో నారాయణ్ మహారాజ్‌ని దర్శించుకోవాలని ఖేడ్గాంలో కొద్దిసేపు ఆగారు.

ఖేడ్గాంలో నారాయణ్ మహారాజ్ దత్తాత్రేయుని దేవాలయం నిర్మించారు. ఆ దేవాలయంలో దత్తాత్రేయుని ఆరాధించడం చాలా పవిత్రంగా భావిస్తారు. దత్తాత్రేయుని ఆరాధించేందుకు, దత్తాత్రేయుని పాదాలు తాకడానికి ముందుగా నారాయణ్ మహారాజ్ అనుమతి ఉంటేనే దేవాలయ ప్రవేశం లభిస్తుంది. అదే ప్రకారం కాలేమామ నారాయణ్ మహారాజ్ అనుమతి కోరితే, నారాయణ్ మహారాజ్ – నీవు బ్రాహ్మణుడివా? అని ప్రశ్నించారు. “అవును” అని కాలే సమాధానమిచ్చాక, ‘గోత్రం’ – ‘ప్రవర’ అడిగి – నారాయణ్ మహారాజ్ సంతృప్తి చెంది – దత్తాత్రేయ విగ్రహ పాదాలు కడగటానికి, లోనికి వెళ్ళి పూజలు చేయడానికి కాలేమామను అనుమతించారు. ఖేడ్గాం ఆశ్రమంలో ఒకరోజు బసచేసి అనంతరం కొల్హాపూర్‌కు ప్రయాణం కొనసాగించారు.

ఆ తర్వాత ఒక సందర్భంలో సాకోరీ వెళ్ళి ఉపాసనీ మహారాజ్‌ని దర్శించుకున్నారు. అలాగే తన ఆఫీసు పనిమీద అహ్మద్‌నగర్‌కు వెళ్ళినప్పుడు కాలేమామ ఖుస్రూ క్వార్టర్స్‌లో ఉపాసనీ మహారాజ్‌ను రెండు సందర్భాల్లో దర్శించుకున్నారు. ఒకసారి– ఉపాసనీ మహారాజ్ – మెహెర్‌బాబా – ఇలా ఇద్దరినీ ఖుస్రూ క్వార్టర్సులో దర్శించుకున్నప్పుడు – కాలేమామకు ఉపాసనీ మహారాజ్ ఒక కొబ్బరికాయ ఇచ్చారు. అలాగే మెహెర్‌బాబా మరో కొబ్బరికాయ బహూకరించారు. ఈ రెండు కొబ్బరికాయలు ‘కాలే’ వారి కుటుంబంలో నేటికీ భద్రంగా ఉన్నాయి. సాయిబాబా దేహత్యాగం చేశాక కాలేమామ మెహెరుని చెంతకు చేరారు. 1926 నుంచి మెహెరాబాద్‌లోనే – తన స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఉపాసనీ మహారాజ్ 1941 డిసెంబర్‌లో దేహత్యాగం చేసినప్పుడు, మెహెర్‌బాబా – కాలేమామతో మరికొందరు మండలి సభ్యులను మహారాజ్ అంత్యక్రియలకై సాకోరీకి పంపారు. కాలేమామ తన జీవితాంతం మెహెరుని సన్నిధిలో కాలం గడిపారు. కాలేమామ భార్య శ్రీమతి జానకి – ఈమెను శ్రీమతి కాలేమామ అని పిలిచేవారు. ఈమె 1932లో మెహెరాబాద్‌లో బాబా సన్నిధిలో తుదిశ్వాస విడిచింది. తన సన్నిధిలో మరణించిన 120 మందికి – అత్యంత సన్నిహిత ప్రేమికులకు మెహెరుడు ఒక సందర్భంలో నివాళి తెలియజేశారు. ఆ 120 మందిలో శ్రీమతి కాలేమామ పేరు కూడా ఒకటిగా వుండటం మనం గమనించాలి.

అనుక్షణం అవతారుని సేవలకే అంకితమైన ధన్యజీవి కాలేమామ, 1954 సెప్టెంబర్ 16న తుదిశ్వాస విడిచారు.

**సంక్షిప్తంగా కాలేమామ గురించి తెలుసుకున్నాక మీకేం అన్పించింది? 2005 అక్టోబరు 2వ తేది నాటికి మీ అభిప్రాయంగా ప్రచురణార్థం ఒక పోస్టు కార్డుపై పంపగలరు.**

# మురళీ కాలే

(1913 జూలై 27 – 1977 ఫిబ్రవరి 6)

**కా**లేమామ కుమారుడు మురళీకాలే!!

1927లో మెహెరాబాద్ ప్రేమాశ్రమంలో చేరిన తొలి పదిమంది విద్యార్థుల్లో ఒకరాయన. ఈయన కుమారుడు నికేత్ కాలే – ప్రస్తుతం జబల్‌పూర్‌లో మెహెర్ సెంటర్ నిర్వహిస్తున్నారు.

మెహెర్‌బాబా నిర్వహించిన నవజీవనంలో మురళీకాలే కూడా పాల్గొన్నారు. నవజీవన నియమ నిబంధనలకు లోబడి ప్రవర్తించిన వారిలో మురళి ముఖ్యుడని, ఎంతటి కష్టాల్లోనైనా నవ్వుతూ – పలువుర్ని నవ్విస్తూ – బాబా ఆజ్ఞని తు.చ. తప్పక పాటించాడని – సాక్షాత్తూ అవతారుడే – మురళీని స్వయంగా ప్రశంసించారు. ***BABA STATED THAT MURALI ALONE HAD MANAGED TO REMAIN CHEERFUL THROUGHOUT ALL THE UPS AND DOWN FACED SO FAR. BABA FOLDED HIS HANDS TO MURALI AS A SALAAM IN RECOGNITION OF HIS MERITS.***

***SEE PAGE 3586 & 3587 IN LORD MEHER - VOL. 9&10.***

నవజీవనంలో ఒకరోజున అందరూ బాబాతోపాటు బస్సులో ప్రయాణిస్తున్నారు. బాబా – కొందరి ప్రేమికుల్ని ఆ బస్సు దిగి – ఆ తర్వాత వచ్చే బస్సులో రమ్మనమని ఆదేశించారు. ఆ మాదిరిగా మురళి కూడా బస్సు దిగాడు. అలా బస్టాండ్‌లో దిగిన మురళీకి అక్కడ తన సోదరి కన్పించింది. నవజీవనంలో బాబా ఆదేశాల ప్రకారం – ఎవరూ తనకు తెల్సిన వాళ్ళతో – సంబంధీకులతో – ఏమీ మాట్లాడకూడదన్నది నియమం. ఆ నియమానుసారం – తన సోదరిని గుర్తుపట్టనట్లు – ఆమెకేసి చూడకుండా – మాట్లాడకుండా అక్కడ్నించి ముందుకు మురళీ కాలే వెళ్ళిపోయాడు. ఆ మర్నాడు, తన సోదరి చనిపోయిందని – టెలిగ్రాం అందుకున్నా – ఏమీ తెలియని వాడిలా సంతోషంగా – మురళీ గడిపారని పేర్కొన్నారు.

హోమియోపతి వైద్య శాస్త్రంలో పట్టభద్రుడైన మురళీ కాలే – మెహెరాబాద్‌లో అనంతరం జబల్‌పూర్‌లో ఎందరికో వైద్యం చేశాడాయన. హోమియో వైద్యశాస్త్రంలో ఉన్నత చదువుల కోసం ఇంగ్లాండు వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. అందుకు బాబా అంగీకారం తెలియజేశారు. 'పాస్‌పోర్టు' సయితం సిద్ధం చేసుకున్నాడు. ఐతే – ఆ దరిమలా మెహెర్‌బాబా ఆజ్ఞ ప్రకారం ఆ





ఆలోచన విరమించుకున్నాడాయన. 1951లో బాబా ఆదేశాల మేరకు – జబల్‌పూర్‌లో స్థిరనివాసం ఏర్పరుచుకుని హోమియో వైద్యం ప్రాక్టీసు చేశాడాయన. 1952లో ఆయన జబల్‌పూర్‌కు వచ్చి మెహెర్ ఛారిటబుల్ డిస్పెన్సరీని ప్రారంభించారు.

మురళీకాలే తన ఏకైక సంతానం – నికేత్ జన్మించినప్పుడు – పుట్టిన కొద్ది రోజులకే నికేత్ తాను జన్మించిన విషయాన్ని బాబాకు తెలియపరిచేలాగా ఆ పసి గుడ్డు బొటన వేలుతో వేలుముద్ర వేయించి, మురళికాలే బాబాకు ఒక లేఖ రాయించాడు. అందుకు జవాబుగా – IT WAS PERHAPS FOR THE FIRST TIME, HE WAS WRITING A LETTER TO A CHILD WHO WAS NOT EVEN A MONTH OLD అని మెహెర్‌బాబా జవాబిచ్చారు. మెహెరుని సేవలో ఎందరికో వైద్యం చేస్తూ, ఎందరినో బాబా సేవకు పరిచయం చేసిన మురళీ కాలే – 1977 ఫిబ్రవరి 6న మెహెరైక్యం చెందారు. వీరు ధన్యులు ●

*(గత సంచిక తరువాయి)*

# అవతార్ మెహెర్‌బాబా జీవిత చరిత్ర

*ఆంగ్ల మూలం:* ***-భావూ కల్చూరీ,***

*లార్డ్ మెహెర్ వాల్యూం-3 (1925-29)*

**మెహెర్‌ప్రభు - వాల్యూం-3**

*-తెలుగుసేత:* **రామారావ్**, న్యూఢిల్లీ

**"మృ**త్యువాత పడ్డ అన్నయ్య ఇహలోకం వదలి వెళ్ళాడంటారు. నేను మాత్రం కాదని ఎలా అంటాను. ఆ మాట నిజమే కదా! నాటకంలో పాత్ర అయిపోగానే, నిష్క్రమణ తప్పదు. జెంషెడ్ చనిపోయాడా? నీ దృష్టిలో చనిపోయింది జెషెండ్ కాదు. వాడి శరీరం మాత్రమే పోయింది.

నా అన్న చనిపోయాడని కదా మీరంతా అంటున్నారు. నేనంటాను, అన్నయ్య మళ్ళీ పుట్టాడు అని. పిల్లవాడు పుడితే ఎంతో ఆనందం వెల్లివిరుస్తుంది కదా! మరి అంత ఆనందం మనిషి చనిపోయినప్పుడు కూడా వుండాలి. ఈ బాధ, ఈ ఏడుపు, గుండెలు బాదుకోవడం మనకు అసలు సంగతి తెలీకపోవటం వల్లనే. మన అజ్ఞానం వల్లనే.

జనన మరణాల రహస్యం తెలిసిన వారికి దృష్టిలో ఇదంతా కపట నాటకంలా కనిపిస్తుంది.

"ఆత్మకి చావులేదు. చావు కేవలం మన శరీరానికే. దైవీ దృష్టి వుంటే, ఈ సంగతి తెలుస్తుంది. నిజమే సుమా అన్న నమ్మకం కలుగుతుంది. శరీరం పోతే, ఆత్మకి నష్టం లేదు. అసలు ఆత్మలో కించిత్ మార్పు రాదు.

"33 ఏళ్ళకే జెంషెడ్ కన్నుమూశాడు కాబట్టి, అయ్యో, పాపం, చాలా చిన్న వయస్సులోనే పోయాడే అనుకొంటున్నారు అందరూ. ఈ వేళో రేపో పోవాల్సిన వాళ్ళమే అందరం. ఆ ముహూర్త సమయం. భగవంతుడికొక్కడికే తెలుసు. ముహూర్తం పెట్టింది ఆయనే కదా!

"ఇంతకీ జెంషెడ్ చిన్న వయస్సు అని ఎందుకు అనుకొంటున్నారు. వాడి వయస్సు నా లెక్క ప్రకారం కొన్ని వేల సంవత్సరాలు. ఎన్ని జన్మలెత్తుతాడో వాడు! భగవంతుడికే తెలుసు ఆ సంగతి.

"ఇంకో మాట. మీ కళ్ళ ముందు కనిపిస్తోంది జెంషెడ్ భౌతికరూపం మాత్రమే. మీరు చూస్తున్నది వాడి ఆత్మని కాదు. అందుకనే వాడు కనుమరుగు కాగానే తట్టుకోలేకపోతున్నారు. ఇది మీ అజ్ఞానం. నన్ను మీలా ఏడుస్తూ కూర్చోమంటారా! ససేమి సర్వకల్ల!

"చావు సహజం. ఎవరికైనా తప్పదు. భౌతిక ప్రపంచం నుంచి తప్పించుకొని అనంతమైన





సూక్ష్మ శరీర ధారణ చేయాలంటే, చావు తప్పదు.

"ఇంకో మాటలో చెప్పాలంటే, చావుతో ఆత్మ గూడు మారుతుంది. ఓ కోటు విప్పేసి, మరో కోటు తొడుక్కోవటం వంటిది మరణం.

జెంషెడ్ చేసిందీ అంతే.

నాటకంలో చూడండి. ఒకే నటుడు ఎన్నిరకాల బట్టలు మారుస్తాడు. తెరదింపగానే పాంటూ, షర్టూ మార్చుకోడూ! ఒకే నటుడు అనేక నాటకాల్లో రకరకాల పాత్రలు ధరించడూ! అంతే ఈ జీవిత నాటక రంగంలో కూడా.

చావుని నిద్రతో పోల్చవచ్చు కొంతవరకూ. ఎలా అంటారా! నిద్రపోయిన వ్యక్తి మెలకువ రాగానే నవ్వుతూ లేచి కూర్చోడు! అలానే చనిపోయిన వ్యక్తి, మరో రూపంలో పుడుతున్నాడు. శరీరం మారుతోంది. అదొక్కటే తేడా!?

రాత్రిళ్ళు నిద్రపోతే ఎవరైనా పట్టించుకొంటారా! 'లేస్తాడులే. పొద్దుటే.. పడుకోనీండి' అనరూ! మరి అయితే "చావు" విషయంలోనూ అలానే ఎందుకు నిర్లిప్తంగా వుండకూడదు.

రైలు ప్రయాణం సంగతి తెలుసు కదా! రైలులో వెడుతుంటే ఎన్నో వూళ్ళు వస్తాయి. ఎందరో కొత్త వ్యక్తులు తారసపడతారు. లోనావాలా, కళ్యాణ్, దాదార్... ఇలా అనేక వూళ్ళలో రైలు కాసేపు ఆగుతుంది. ఏమవుతుంది. ఎవరి వూరు రాగానే వాళ్ళు దిగిపోరూ! టిక్కెట్టు కొని మరీ రైలు ఎక్కుతారు కొత్తవాళ్ళు. అవునా.

అలానే, జెంషెడ్ రైలు ప్రయాణంలో, దిగాల్సిన వూరు వచ్చింది. దిగి వెళ్ళిపోయాడు. వాడి వూరు పెద్ద దూరంలో లేదు కాబట్టి ముందే వచ్చింది. దిగాడు. వెళ్ళిపోయాడు. మీరేమో చిన్న వయస్సులో చనిపోయాడని దిగులు పడుతున్నారు.

ఎందరో రైలు ఎక్కుతారు. దిగిపోతారు. వాళ్ళు పోయిన ప్రతిసారీ ఏడుస్తూ కూర్చొంటామా? అయినా ఎన్నిసార్లని ఏడుస్తాము? రైలు బండి రాత్రి, పగలు నడుస్తూనే వుంటుంది. గమ్యం చేరగానే ఆగిపోతుంది. మళ్ళీ తిరుగు ప్రయాణం మొదలుపెడుతుంది.

చనిపోయాడన్న బాధకంటే, అయ్యో, నేనారాధించే వ్యక్తి, నాకిష్టమయినవాడు, నా కళ్ళ ముందు లేకుండా పోయాడన్న దిగులు మనల్ని పట్టి కుదిపేస్తుంది. ఆ బాధ తట్టుకోలేక ఏడుస్తాం! మా నాన్న పోయాడే, మా అమ్మ చనిపోయిందే, నా కళ్ళ వెలుగు, నా ఊపిరి, నా ఆరో ప్రాణం పోయిందే అని కన్నీరు మున్నీరుగా ఏడుస్తాం.

ఈ "నా" అన్న భావనే, మన బాధలన్నింటికీ మూలకారణం. ఇదీ ఒకరకమైన స్వార్థమే.

అనాది నుంచీ మృత్యువు విలయతాండవం చేస్తోంది. లక్షలాది మంది తమ్ముళ్ళు, అన్నయ్యలు చనిపోవటం నేను చూస్తున్నా రోజూ. అందుకనే జెంషెడ్ చావుకి నేను స్పందించలేదు.

చావు తప్పదని అందరికీ తెలుసు. అయినా సరే ఎవరు పోయారని తెలిసినా చివుక్కుమనిపిస్తుంది. గుండె పిండేసినట్లయి ఏడుపు తరుముకు వస్తుంది. ఇదొక పిచ్చి. గుండె

దిటవుగా లేకపోవటం వల్లనే అనాలి.

ఏదీ శాశ్వతం కాదు. జీవాత్మ ఒక్కటే శాశ్వతం. సద్గురువులు, అవతార పురుషులు, తమ కర్తవ్య నిర్వహణ పూర్తికాగానే, సిద్ధి చెందుతారు. మరి సామాన్యుల సంగతి వేరే చెప్పాలా! ఈ రావటం, ఈ పోవటం, చావు పుట్టుకల అనుభవం, సంస్కారాలు ప్రోగుచేసుకోవటం, అంతా అదొక అనుభూతి. ఈ సృష్టి రహస్యాన్ని అర్థం చేసుకోవటం చాలా కష్టం.

కర్మ సిద్ధాంతాన్ని చాలామంది నమ్మరు. పునర్జన్మ వుంటుందని వొప్పుకోరు. అసలు ఆ ఆలోచనే వాళ్ళని భయకంపితుల్ని చేస్తుంది. మోడువాడిన చెట్టు మళ్ళీ చిగురిస్తుందా! అలానే చచ్చినవాడు మళ్ళీ పుడతాడా? అని ఎదురు ప్రశ్న వేస్తారు.

జెంషెడ్ సంగతే తీసుకోండి. నిజంగా కన్ను మూసి వుంటే, అంటే భగవంతునిలో ఐక్యమయితే, మనకి కావాల్సిందేముంది. మనం పండగ చేసుకోవాలి వాడి అదృష్టం చూసి. అహంకారం అణిగితే తప్ప, దైవత్వం సాక్షాత్కరించదు. అహంకారం నశించాలి. అదే నిజమైన చావు. చనిపోయిన వాళ్ళని చూసి ఏడుస్తూ కూర్చోవటం వుందే అది శుష్క దండగ.

నేను మీ మధ్య మసలుతున్నాను. మీతో ఆటలు ఆడుతున్నా. మామూలు మనిషిలా ప్రవర్తిస్తున్నా. మీ అందరిలా, సగటు ప్రాణిలా! కానీ మీకు తెలుసా? నేనూ చనిపోయాను. నిజం. నమ్మండి నా మాట. భగవంతునిలో ఏకమయితేనే నిజమైన చావు వచ్చినట్లు. మళ్ళీ పుట్టుకలుండవు.

**కబీరు ఏమన్నాడో తెలుసా? నేను చచ్చిపోతున్నా, నేను చచ్చిపోతున్నా అని అంటారు అందరూ. కానీ ఎవరూ చావరు. చావుకంటే ముందుగా చనిపోయినవాడు మళ్ళీ చనిపోడు.**

**నేను చనిపోయాను కాబట్టే సజీవిని. కబీరు చెప్పిన చావు రావాలని కోరుకోండి. ఊపిరి ఆగిపోవడం, నాడి కొట్టుకోవడం కాదయ్యా చావు అంటే. కోర్కెలు చచ్చిపోవాలి. ప్రలోభాలకి దూరం కావాలి. మాయ నుంచి విముక్తి పొందాలి. సంస్కారాల వలయం నుంచి తప్పించుకోవాలి. అదే నిజమైన మరణం. అప్పుడే అనంతమూర్తిలో జననం. నిజమైన పుట్టుక అంటే ఏమిటి? భగవంతునిలో ఐక్యం కావటం. ఆయన సాక్షాత్కారం పొందటం. ఋషులు, ప్రవక్తలు, సద్గురువులు ఏం చేస్తారో తెలుసా? భగవంతుని పాద పద్మాల దగ్గర తమ సర్వస్వం సమర్పిస్తారు. అందువల్లనే జీవిత ధ్యేయమైన గమ్యం - భగవంతునిలో లీనం కాగలగటం వాళ్ళకి వీలవుతుంది. మళ్ళీ మళ్ళీ పుట్టుటమంటూ వుండదు వాళ్ళకి. పుట్టుకలు లేవు కాబట్టి వందలాదిసార్లు మరణించడమన్న ప్రసక్తే లేదు.**

ఈ స్థితిని కోరుకోండి. ఆ స్థితి చేరడానికి ప్రయత్నం చేయండి.

కన్ను మూసినవాడంటే వల్లమాలిన ప్రేమ, అభిమానం వుండవచ్చు. కానీ ఆ ప్రేమ, ఆ అభిమానం స్వార్థరహితంగా వుండాలి. చనిపోయిన వాళ్ళకి కావాల్సింది నిజమైన ప్రేమ. స్వార్థరహితమైన ప్రేమ. అప్పుడే వాళ్ళ ఆత్మలకి వుండకలిగేది ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు వెళ్ళగలిగేది.





మీరు కళ్ళ నీళ్ళు పెట్టుకోవటం వల్ల, గుండెలు బాదుకొంటూ ఏడవటం వల్ల, చనిపోయిన వారి ఆత్మలకి సంతోషం కలగదు. వాళ్ళ ఆత్మల పురోగతి కోరుకొనే పక్షంలో మీరు నిస్వార్థ ప్రేమ కనబరచాలి వాళ్ళ పట్ల. మీ చేతలతో ఇబ్బంది పెట్టకండి.

నేను మృత్యు దేవతకే పాఠాలు చెప్పే గురువుని. అందుకనే మృత్యుదేవత జెంషెడ్ అన్నయ్యని నా దగ్గరికి తెచ్చింది. కాబట్టి, అయ్యో జెంషెడ్ పోయాడే అంటూ దండగమారి ఏడుపు కట్టిపెట్టండి. మీ పనులు చేసుకోండి. జెంషెడ్ చచ్చిపోయాడు కాబట్టి ప్రపంచం స్తంభించి పోయిందనుకోకండి. మళ్ళీ జన్మ వుంటుందని నమ్మిన వాళ్ళకి చీకూ చింతా వుండదు. ఎండిపోయిన పంట చూసి ఏడుస్తూ కూర్చొంటే లాభం వుందా! చనిపోయిన వాళ్ళని చూస్తూ కూర్చొంటే లాభం వుందా! చనిపోయన వాళ్ళని చూస్తూ కూర్చొన్నా అంతే! కోర్కెలకి అతీతంగా వుండగలిగితే, చావు పుట్టుకల వలయం నుంచి బయటపడవచ్చు. లేదు పుడ్తూనే వుంటాం. చస్తూనే వుంటాం. మరో దారిలేదు.

ఈవాళ్టితో నూకలు చెల్లాయని తెలిస్తే ఏం చేస్తాం. మన చేతుల్లో ఏముంది కనుక? ఏదో ఒకరోజు పోవాల్సిందే. అందుకని ఏడవటం దేనికి? భగవంతుని ఇచ్ఛకి లొంగి వుండడం తప్ప. మనం చేయగలిగింది ఏమీ లేదు."

బాబా చెప్తుంటే, శ్రద్ధగా విన్నారు మండలివారు. కొంచెం బాధ తగ్గింది. 'భవబంధాల నుంచి విముక్తి మార్గం చెప్పు బాబా. చావు పుట్టుకల నుంచి తప్పించుకొనే సులభమైన మార్గం వుందా!' అని అడిగాడో మండలి సభ్యుడు.

**బాబా: "ఆధ్యాత్మిక గురువుని ఆశ్రయించి, ఆయన శరణు కోరితే తప్పకుండా మీ లక్ష్యం నెరవేరుతుంది. అదే అతి సులువైన మార్గం. భగవత్ సాక్షాత్కారం కోసం పరితపించాలి. పట్టిన పట్టు వదలకూడదు. భగవత్ సాక్షాత్కారానికి ఇంకా అనేక మార్గాలున్నాయి. అవి ఆషామాషావి కాదు. చాలా కష్టమైనవి. గమ్యం కూడా త్వరగా రాదు. సేవ పరమోత్కృష్టమైన మతమని అందుకనే అంటారు. ఋషుల సాంగత్యం, సద్గురు సేవ, వాళ్ళు చెప్పిన ప్రకారం చేయటం వల్ల సులువుగా, అలసట లేకుండా మోక్షం పొందగలుగుతాం. ఆత్మకి స్వేచ్ఛ ప్రసాదించగలుగుతాం. ఇందాక చెప్పినట్లు, భగవత్ సాక్షాత్కారం కావాలంటే, గాఢమైన తపన అవసరం. ఆ తపన లేకపోతే, సద్గురువు చెప్పే సేవా మార్గం కూడా చాలా కష్టమైనదిగా కనిపిస్తుంది. ఎన్నో వందల వేల జన్మలు ఎత్తితేనే కానీ మోక్షం రాదని మరచిపోకండి.**

మరోమాట. మనలో బలహీనతలు ఎన్ని వున్నా, భగవత్ సాక్షాత్కారం కోసం తపన వుంటే, అసాధ్యమైనది కూడా సాధ్యమవుతుంది.

ఎలాగా? ఓ ఉదాహరణ చెప్తాను. ఓ చిన్న నావని పెద్ద స్టీమరు వెనకాల కడితే ఏమవుతుంది. ఎంత దూరమైనా అవలీలగా వెళ్ళదూ! తుపానులో కొట్టుకుపోతుందా? మునిగిపోతుందా? పోదుకదా! మరి అదే నావని ఒంటరిగా వదిలేస్తే, గమ్యం ఎప్పటికి చేరుతుంది? మధ్యలో తుపాను వస్తే, మునిగినా మునిగిపోవచ్చు. అవునుకదా! అలానే, ప్రాపంచిక విషయాల్లో మునిగి

తేలుతున్న వాళ్ళనుకొంటారుకదా నచ్చిన మార్పులుని మేమే తీసుకురాగలమని. ఆ మార్పుల కోసం వెంపర్లాడతారు. అదో తెలివిలేనితనం. అదో మూర్ఖత్వం. పెను తుపాను గాలులు వీస్తుంటే, చిన్న పడవలో సప్త సముద్రాలు దాటాలనుకోవటం ఎంత మూర్ఖత్వమో, ఇదీ అంతే.

కేవలం సద్గురువు మాత్రమే మనల్ని అవలీలగా ఆవలి గట్టుకి చేర్చగలడు. అందుకనే, సద్గురువులు అవతరించేది. ప్రపంచం తప్పుదారి పట్టకుండా నివారిస్తారు సద్గురువులు. సన్మార్గం చూపిస్తారు వాళ్ళు. సత్యమూర్తులు సద్గురువులు. వాళ్ళతో సహకరించటం నీ విధి. నీ కర్తవ్యం!

మెహెరాబాద్‌లో మామూలు వాతావరణం నెలకొంది. ఎవరి పనుల్లో వాళ్ళు మునిగితేలుతున్నారు. మార్చి 4వ తేదీన బాబా ఓ మాట చెప్పారు.

"జంతువులకి ఓ శక్తి వుంది. అది వాళ్ళ సహజ గుణం. ఎదురుగా ఎర వుందనో, ప్రమాదం పొంచి వుందనో గ్రహించగల శక్తి అది.

మనుష్యులకి మరో శక్తి వుంది. అది వాళ్ళ మేధస్సు. కానీ నీ దగ్గరకి ఎవరు వస్తారో తెలుసా? నా ప్రేమకి ఆకర్షితులైనవాళ్ళు వస్తారు. తెలివి తేటలు తమ సొత్తు అయినవాళ్ళు కాదు. జంతువుల సహజ గుణం వున్నవాళ్ళూ కాదు. నా దగ్గరికి రావాలన్న తపన పుట్టినవాళ్ళు. నేను ఓ మిఠాయి దుకాణం వంటివాడిని. మిఠాయి సువాసనలు వాళ్ళని రప్పిస్తాయి నా దగ్గరికి.

ప్రాపంచిక సంబంధాల నుంచి తెగతెంపులు చేసుకొంటే, దేని గురించీ తపన వుండదు. ఎక్కడలేని స్వేచ్ఛ లభిస్తుంది. కానీ అందరూ అలా చేయలేరు. సమస్యల దొంతర చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తుంటుంది.

"ఈ బంధనాలు ఎటువంటి వంటే, మన జుట్టులాంటివి. ఎంతగా జుట్టు పెరిగితే, అంతగా సేవ చేయాలి – జుట్టు చిక్కులు పడకుండా వుండాలంటే. నూనె వ్రాయాలి. దువ్వెనతో దువ్వాలి. అవునా! లేకపోతే ఎంతో ఇబ్బంది పాడు జుట్టుతో. అలానే మనం పెట్టుకొనే బంధనాలు కూడా. బంధనాలు పెంచుకొంటూ పోతే, అయినదానికీ కానిదానికీ ఆదుర్దా తప్పదు.

మార్చి 21వ తేదీన మెహెరాబాద్‌లో సెలవు ప్రకటించారు. ఆవాళ పార్శీల పండుగ – జెంషెడ్–ఇ–నవరోజ్. ఉదయం ఆరింటికే, బాబా మిఠాయి ప్రసాదం పెట్టారు.

ఆయన సాయిదర్బార్‌లో ఆసీనులు కాగానే, మహిళా మండలి దర్శనం చేసుకొని, ఆశీస్సులు పొందారు. వాళ్ళ తర్వాతి వంతు పురుష మండలిది. మండలితో ఓ ఫోటో, ఆ వేళ్టికి వచ్చిన వాళ్ళతో మరో ఫోటో తీశారు. మధ్యాహ్నం పియారో కవాలీ పాటల కచేరీ పెట్టారు. సాయంత్రం ఆరున్నరదాకా పియారో పాటలు పాడారు.

స్కూలు బాగోగులు చూడటానికి బాబా ఓ కమిటీని వేశారు. కమిటి పెద్దలు చాలామంది స్కూలు పిల్లలే. స్కూలుకి ఏం కావాలో వాళ్ళు సర్కిల్ కమిటీకి చెప్పాలి.

*(సశేషం)*





*(గత సంచిక తరువాయి)*

# అందరికోసం

## సులభ శైలిలో మెహెర్‌బాబా ప్రవచనములు

**-బి. రామకృష్ణయ్య**

**ఒకసారి మగజన్మ, ఆ తర్వాత స్త్రీ జన్మ అలా వరుసగా ఆడ మగ జన్మలు ఒకటి తర్వాత ఒకటి, పగలు రాత్రిళ్ళలాగా వస్తుంటాయా!**

*(4వ భాగం)* ***చదవండి మరి!!***

**సంతోష్:** జై బాబా!

**ప్రశాంత్:** జై బాబా అంకుల్!

**మూర్తి:** జైబాబా! రండి నాయనా! విరామం లేకుండా, మరచిపోకుండా వచ్చారు. అంటే ఈ విషయంలో మీకంత శ్రద్ధ ఏర్పడిందన్నమాట.

**సంతోష్:** మానవ రూపానికి ముందు అన్ని రూపాలు ఒకేసారి ఒక్కొక్కటిగా ఆత్మ ధరించిందన్నారు కదా! మరి మానవ రూపం కూడా ఒక్కసారి ధరిస్తే సరిపోదా! 84 లక్షల జన్మలు ఎందుకు అవసరం!

**ప్రశాంత్:** అవును కదా! అంకుల్! ఒకే జన్మలో అన్ని అనుభవాలు పొంది ఆత్మ పరమాత్మలో ఐక్యం అయిపోతే సరిపోయేది కదా!

**మూర్తి:** ఒకే జన్మలో, పురుషుడుగా, స్త్రీగా అనుభవం పొందగలవా? వీలుపడదు. అందువల్లనే జీవాత్మ మానవ రూపం ధరించగానే అంతవరకు ప్రోగుచేసుకొన్న లెక్కించలేనన్ని సంస్కారాలను మనస్సులో భద్రపరచుకొని వెంట తెచ్చుకొంటుంది. ఆ సంస్కారాలు ఒక్కొక్కటిగా పరస్పర వ్యతిరేకానుభవాల ద్వారా భౌతిక ప్రపంచంలో ఖర్చు చేయబడాలి. ఒక సంస్కారానికి చెందిన అనుభవం కోసం ఒక రూపాన్ని ధరించి అనుభవం పొందేటప్పుడు మిగిలిన సంస్కారాలు మనస్సులో భద్రంగా దాచబడి ఉంటాయి. పురుష రూపంతో జన్మయెత్తినప్పుడు స్త్రీ రూపం అనుభవించాల్సిన సంస్కారాలు మరుగున దాచబడి ఉంటాయి. పురుష రూపంలో ఉన్నప్పుడు ఆ రూపంలో పొందవలసిన అనుభవాలనే పొందుతాడు.

**సంతోష్:** అయితే ఒకసారి మగవాడుగా జన్మించినవాడు వచ్చే జన్మలో స్త్రీగా పుట్టవలసిందేనా!

**ప్రశాంత్:** అంకుల్! ఒకసారి మగజన్మ, ఆ తర్వాత స్త్రీ జన్మ అలా వరుసగా ఆడ మగ

జన్మలు ఒకటి తర్వాత ఒకటి, పగలు రాత్రిళ్ళలాగా వస్తుంటాయా!

**మూర్తి:** ఒకటి తర్వాత ఒకటిగా ఆడ, మగ జన్మలు ఎత్తాలనే నియమం ఏమీలేదు. ఇది సంస్కారాలను బట్టి అనుభవం పూర్తిగా సిద్ధించే వరకు ఒకటిగాని, రెండుగాని ఇంకా ఎక్కువగాని జన్మలు వరుసగా పురుషుడుగానో, స్త్రీగానో ఎత్తవచ్చు, వరుసగా ఆ రూపాలతో అనుభవాలు పొందవచ్చు. అలా ఒకవైపున అనుభవం పూర్తికాగానే దానికి విరుద్ధమైన రెండవ వైపున అనుభవం పొందడానికి విభిన్న మానవ రూపాలను జీవాత్మ ధరిస్తుంది. అలా ఒక్క లింగ భేదం వల్లనే గాక వివిధ మతాలకు, వివిధ కులాలకు, వివిధ జాతీయాలకు, వివిధ రంగులకు, వివిధ దేశాలకు, వివిధ ఖండాలకు చెందిన ప్రతి ఒక్క అనుభవం కోసం దానికి తగిన శరీరాన్ని జీవాత్మ ధరిస్తుంది. ఒక జన్మలో ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తిని చూపితే చంపడమనే అనుభవాన్ని (సంస్కారాన్ని) పొందుతాడు. దానికి విరుద్ధమైన అనుభవం చంపబడడం. చంపడమనే అనుభవం, చంపబడడమనే అనుభవంతో సమం చేయబడి నిర్వీర్యం చేయబడాలి. లేకపోతే ఆ వ్యక్తి అలాగే ఇతరులను చంపుతూ పోతుంటాడు. దానికి అవరోధం ఉండదు. కాని సృష్టి ధర్మం ప్రకారం, సంస్కారాల స్వభావం ప్రకారం ఒకేరకమైన అనుభవానికి ఒక హద్దు, లేదా ఒక పరిమితి ఉంటాయి. ఆ హద్దు లేదా పరిమితికి చేరుకోగానే ఆ వ్యక్తి సహజంగానే వ్యతిరేక సంస్కారాల ప్రాబల్యంతో వ్యతిరేకానుభవం వైపుకు కొనిపోబడతాడు. ఉదాహరణకు పాత కాలపు గోడ గడియారాల్లో అటు ఇటు తిరిగే పెండులం అనే లోలకం ఉండేది. దాని ఆధారంగానే సమయాన్ని సూచించే ముల్లు తిరుగుతుంది. ఆ పెండులం కుడివైపునకు ఎంత దూరం వెళితే, దానికి ఎదురు వైపున ఎడమ వైపునకు అంతే దూరం వెళుతుంది. ఆ ఇరువైపులకు వెళ్ళే దూరం, వేగం సమానంగా ఉంటాయి. మానవ రూపాల్లో సంస్కారాల ద్వారా అనుభవించే వ్యతిరేకానుభవాలు కూడా అలాగే పరస్పరం విరుద్ధంగా సమానంగా ఉంటాయి.

**సంతోష్:** ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తిని చంపితే, వ్యతిరేకానుభవం కోసం మళ్ళీ ఆ వ్యక్తితోనే ఇంకో జన్మలో చంపబడాలా! ఇంకెవరితోనైనా చంపబడినా సరిపోతుందా!

**మూర్తి:** సాధారణంగా అనుభవాలు పరస్పరంగా ఆయా వ్యక్తుల ద్వారానే తీర్చుకోబడాలి. ఒక వ్యక్తి నుండి అప్పు తీసుకుంటే, ఆ వ్యక్తికి ఇస్తేనే అతని అప్పు తీరుతుంది కదా! సంస్కారాల బంధాలుకూడా అలాంటివే. ఆ బంధాలు గల వ్యక్తులు తెలియకుండా తర్వాతి జన్మల్లో కూడా ఒకే ప్రాంతంలో ఏదో ఒక సంబంధంతో జన్మించి కలిసి జీవించి పొందవలసిన అనుభవాలను పూర్తిచేసుకుంటారు. అనేకులతో అలాంటి కర్మ బంధనాలు అనగా సంస్కారాలను పెంచి పోషించుకోవడం వల్లనే అనేక జన్మలకు అది మూలకారణం అవుతుంది. అలా అనుభవాలను తీర్చుకోవలసిన వ్యక్తుల మధ్య, ఆ పరివారంలోజన్మించే అవకాశాన్ని సద్గురువులు, అవతారుడు





కలుగజేస్తారు. ఆధ్యాత్మిక పరిపాలనలో భాగంగా వారు నిర్వహించే విశ్వకార్యంలో అదొక ముఖ్యమైన పని.

**ప్రశాంత్:** అంకుల్! ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తిని చంపినప్పుడు పొందిన చంపడం అనే అనుభవాన్ని బ్యాలెన్స్ అంటే సమం చేయడం కోసం అదే వ్యక్తితో చంపబడాలా! అయితే ఆ జన్మలో సాధ్యం కాదు గదా! వచ్చే జన్మలో ఆ వ్యక్తి ఎవరో ఎలా తెలుస్తుంది?

**సంతోష్:** ముఠా కక్షలతో, కార్పణ్యాలతో ఎంతోమంది ఫ్యాక్షనిస్టులు, హింసావాదులు ఇతరులను చంపడం చూస్తున్నాము. ఈ జన్మలోనే వారు కూడ ఇంకెవరితోనో చంపబడడం కూడా చూస్తున్నాము. అలా చంపడం, చంపబడడమనే అనుభవాలు బ్యాలెన్స్ చేయబడవా!

**మూర్తి:** మీ సందేహాలు సరియైనవే నాయనా! సంస్కారాలు సమంగా బ్యాలెన్స్ చేయబడాలంటే అవి సంఖ్యాపరంగా పరిమాణంలోనే (Quantitative) గాకుండా గుణాత్మకంగా (Qualitatively) కూడా సరిపోవాలి. అంటే అనుభవం ఒక్కటే సరిపోదు. ఆ అనుభవానికి మూలకారణాలైన గుణాలు కూడా సరిపోవాలి. అంటే చంపడానికి మూలకారణాలు ఎన్నో ఉంటాయి. ఉదాహరణకు, పగ, ఈర్ష్య, ద్వేషాల వల్ల గాని, డబ్బు కోసం గాని, స్త్రీ కోసం గాని, అలా ఒక కారణం వల్ల చేసిన పని, పొందిన అనుభవం, ఇంకొక కారణం వల్ల చేసిన పని అనుభవంతో సమం (బ్యాలెన్స్) కాదు.

**ప్రశాంత్:** అంకుల్! అలాగయితే ఇది ఎప్పటికి విడిపోని చిక్కుముడిలాగా కనిపిస్తుంది కదా!

**మూర్తి:** సరిగ్గా చెప్పావు నాయనా! అందుకే గదా మానవ జన్మలో 84 లక్షల జన్మలు అవసరమౌతాయి అని చెప్పబడింది. మానవ రూపం ధరించే సమయంలో వెంట బెట్టుకొని తెచ్చుకున్న సహజ సంస్కారాలకు మానవ జన్మలో అనేకానేక అసహజ సంస్కారాలు కూడా చేర్చబడుతుంటాయి. అందుకనే సంస్కారాలు ఎప్పటికి తరిగి పోకుండా అలా వెంటాడుతూ మనస్సులో భద్రంగా ఉంటాయి.

**సంతోష్:** మరయితే ఈ సంస్కారాలను వదిలించుకునేదెలా!

**మూర్తి:** సంస్కారాలను లేకుండా చేసుకోవడానికే మానవ రూపంలో పునర్జన్మ క్రమం అవసరమయ్యింది. ప్రతి జన్మలో ఖర్చు చేసుకోవాల్సిన సంస్కారాలు వాటి ద్వారా పొందవలసిన అనుభవాలు జన్మించడానికి ముందే నిర్ణయించబడతాయి. దానిని ఒక సినిమా రీలుతో పోల్చవచ్చు. మానవ జీవితమనే ప్రొజెక్టర్ ద్వారా జీవాత్మ ఆ రీలులోని దృశ్యాలను చైతన్యమనే తెరపైన ప్రదర్శించుకుంటూ ఉంటుంది. కాని విచిత్రమైన విషయమేమంటే అలా జన్మకు ముందే తయారు చేయబడి జీవితమనే ప్రొజెక్టర్‌లో అమర్చబడిన రీలును ప్రదర్శించుకొనే సమయంలోనే మళ్ళీ వచ్చే జన్మకు కావలసిన అనుభవాల సినిమా రీలును ఏకకాలంలోనే తయారు చేస్తుంది. మానవ జీవితం ఫిల్మును ప్రదర్శించే ప్రొజెక్టరు, ఫిల్ము తయారుచేసే

కెమెరా రెండింటిని కలిపి అమర్చిన యంత్రం మానవ రూపం వచ్చిన తర్వాత పునర్జన్మ క్రమంలో కొన్ని లక్షల జన్మల వరకు సంస్కారాలు తరగకుండా ఖర్చు చేసుకొన్న సంస్కారాల కంటే ఇంకా ఎక్కువగా కొత్త సంస్కారాలు చేరుతుంటాయి. ఒక విత్తనం నాటితే చెట్టు మొలిచి దానివల్ల మళ్ళీ ఎన్నో అలాంటి విత్తనాలు వస్తాయి కదా! అలాగే ఈ సంస్కారాలు పెరుగుతూ ఉంటాయి. దీనిని ప్రవచనములు అనే గ్రంథంలో బాబా ఒక రీలుపైన చుట్టబడే దారపు కండెతో పోల్చి చెప్పారు. మనస్సనే రీలుపైన చుట్టబడే దారం లాంటిదే సంస్కారాలు. దారం చుట్టబడడమనే ప్రక్రియ జీవాత్మకు తన ప్రయాణం ప్రారంభమైన సమయం నుండే అనగా రాతి స్థితి నుండే ప్రారంభమైనా మానవ జీవితపు తొలి జన్మల్లో చాలా వేగంగా చుట్టుకొంటుంది. ఎందుకంటే అప్పుడు సహజ సంస్కారాలతోబాటు అసహజ సంస్కారాలనే దారం దానికితోడై చుట్టుకొంటుంది.

**ప్రశాంత్:** అంకుల్! ఈ అసహజ సంస్కారాలంటే ఏమిటి?

**మూర్తి:** సహజ సంస్కారాలనగా చైతన్యం వృద్ధి చెందడానికి మనస్సు పూర్తిగా వికసించడానికి తోడ్పడి జీవాత్మ ప్రయాణాన్ని సక్రమంగా ముందుకు నడిపించే సంస్కారాలు. మానవ జన్మ సంప్రాప్తించే వరకు పరిణామ క్రమంలో ఏర్పడిన సంస్కారాలన్నీ సహజ సంస్కారాలే. ఇక మానవ రూపం వచ్చిన తర్వాత గమ్యం చేరడానికి చేసే ప్రయాణాన్ని ఆపివేసి ఆలస్యం చేసే కృత్రిమ పద్ధతుల ద్వారా మానవుడు పొందగోరే అనుభవాలన్నీ అసహజమైన సంస్కారాలను ఏర్పరుస్తాయి. దైవ సృష్టికి ప్రతిసృష్టి చేస్తూ మానవుడు తన మేధాశక్తి నుపయోగించి చేసే 'క్లోనింగ్' లాంటి ప్రక్రియలన్నీ అసహజ సంస్కారాలను కలుగజేస్తాయి. మానవుడు శాస్త్ర పరిశోధనల ద్వారా 'హైబ్రీడ్', 'క్రాసింగ్స్' పద్ధతుల ద్వారా చేసే కొత్త మొక్కల, విత్తనాల సృష్టి కూడా పరిణామ క్రమంలో అవరోధాలను సృష్టిస్తుంది.

**సంతోష్:** అయితే అలాంటి శాస్త్ర పరిశోధనల ద్వారా సాధించిన ఫలితాలు మానవాళికి లాభదాయకం కాదా!

**మూర్తి:** ప్రాపంచిక విలువలతో పోలిస్తే అవి మానవాళికి అధిక సౌకర్యాలను, లాభాలను కలుగజేస్తాయి. అందులో సందేహం లేదు. కాని ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే అవి జీవాత్మ గమ్యాన్ని చేరడానికి చేసే ప్రయాణాన్ని ఆలస్యం చేస్తాయి. కాబట్టి ఆ దృష్టితో వాటిని అవరోధాలుగానే పరిగణించవలసి వస్తుంది. ఇవన్నీ మూలంలోకి వెళ్ళి పరిశీలించి చూస్తే ఈ సృష్టికి కారణమైన పరమాత్ముని లహర్‌లని అంతర్భాగమైన ప్రణాళిక ప్రకారంగా జరుపబడేవే అని బాబా చెప్పిన మాటల వల్లే తెలియవస్తుంది.

**-సశేషం**





*(గత సంచిక తరువాయి)*

## మెహెర్‌బాబా ప్రసంగములు

# సంస్కారముల నిర్మూలనము

అనువాదం: **కె.వెంకట్రావ్**, హైదరాబాద్

### రెండవ భాగం

### సంస్కారము నిర్మాణం, వాటి కార్యవిధానం

కాని ఇవి కేవలం ఆ రూపాంతరాలు వాటిని రక్షించుకొనేటంత వరకే ఉపయోగపడతాయి. జంతువులలో ఈ రకమయిన ప్రవృత్తి ఎక్కువగా కనబడుతుంది. కాని తనను తాను తెలుసుకోవడానికి కావలసిన చైతన్యం ఈ జంతువులలో ఉండదు.

***మానవ చైతన్యం:*** మానవ రూపం ధరించిన తరువాత చైతన్యం పరిపూర్ణవంతమవుతుంది. ఈ దశలో మానసిక దేహం విస్తృతంగా తర్కించగలదు. ఏదయినప్పటికీ చైతన్యం పూర్తిగా ఉండడం మూలాన్నీ పరమాత్మను తెలుసుకొనే అవకాశం పూర్తిగా ఉంటుంది. ఈ ప్రయాణం పూర్తయ్యేటప్పటికి సాధారణ జీవాత్మ సద్గురువుగా మారుతుంది. ఈ సద్గురువే నిష్కలంక పుష్పం.

***సంస్కారాల చుట్టివేత:*** సాధారణ మానవ చైతన్యం ద్వారా పరమాత్మ తన నిజస్థితిని తెలుసుకోలేరు. దీనికి కారణం దాని చుట్టూ పట్టుకొని ఉన్న సంస్కారాలే. సృష్టి ప్రారంభం నుండి పరిణామం ద్వారా వివిధ రూపాలలో ఆత్మ ప్రయాణం వలన తెచ్చుకొన్న సంస్కారాలు కాక అదనంగా మానవ జన్మలో ఏర్పడే సంస్కారాలు ఇవన్నీ ప్రతిబంధకాలే.

ఈ ప్రక్రియను ఒక దారపు ఉండచుట్టూ చుట్టబడిన దారంగా చెప్పవచ్చు. ఇందులో దారం సంస్కారం గాను ఉండ ప్రత్యగాత్మగానూ పోల్చవచ్చు.

*సంస్కారాల బలాన్ని సూచించే కొన్ని ఉదాహరణలు:* అనేక రకాలయిన వస్తువులు సంఘటనలు మొదలయిన వాటి వలన మానవ జీవితంలో అనేక రకాలయిన సంస్కారాలు ఏర్పడతాయి. ఉదాహరణకు కొన్ని సందర్భాలలో విభిన్నమయిన బలవర్ధకమయిన సంస్కారాలు ఏర్పడతాయి. ఏదయినా మంచి సంగీతం విన్నప్పుడు, అందమయిన దృశ్యాలను చూసినప్పుడు మృదువయిన సంస్కారాలు, ఎవరయినా మేధావిని కలిసినప్పుడు వంటికి సంబంధించిన మంచి సంస్కారాలు, మూఢ నమ్మకాలతో కూడిన సంఘటనలు తారసపడినప్పుడు వాటికి

సంబంధించిన సంస్కారాలు ఏర్పడి చైతన్యంపై ప్రభావాన్ని చూపుతాయి.

***మూఢనమ్మకాలతో కూడిన సంస్కారాలు:*** ఈ విషయానికి సంబంధించిన ఒక కథను విచారిద్దాం. పూర్వం మొగలు సామ్రాజ్యపు కాలంలో ఒక విద్యావంతుడు దెయ్యాలపై పరిశోధిద్దామని అనుకున్నాడు. నిజానికి ఈతనికి దెయ్యాలంటే భయం. అమావాస్యనాడు, అర్ధరాత్రి వేళ శ్మశానంలో మేకు భూమి మీద కొడితే దెయ్యాలు దర్శనమిస్తాయి అని చెప్పగా తనే స్వయంగా ఆ పనిని చెయ్యడానికి పూనుకున్నాడు. అనుకున్నట్లుగా అమావాస్యనాడు అర్ధరాత్రి శ్మశానంలో మేకుని దిగ్గొట్టి వెనుకకు తిరిగేటప్పటికి ఎవరో తనని లాగినట్లనిపించింది. నిజానికి జరిగిందేమిటంటే మేకు కొట్టేటప్పుడు తన పంచ కొంగు దానికి తగిలి ఉండిపోయింది. ఈ సంఘటనతో పాపం అతను గుండె ఆగి శ్మశానంలోనే చనిపోయాడు. ఇది కేవలం మూఢ నమ్మకాలకు సంబంధించిన సంస్కారము వలన జరిగినదే.

***సంస్కారాల నుండి విముక్తి పొందినప్పుడు అనుభవం ఎంతో ఆనందదాయకంగా ఉంటుంది:*** సంస్కారాల బలాన్ని ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదు. కొన్ని సంస్కారాలు ఎంత ప్రయత్నించినా మనస్సును వీడి బయటకు పోవు. అవి వాటంతట అవి కాలానుకూలంగా పల్చపడవలసిందే. ఒక్కొక్కసారి వాటి ఉనికి కోసం మంచి చెడు సంస్కారాలు ఒకదానితో మరొకటి పోటీపడుతూ ఉంటాయి. అప్పుడే మానసిక ఆందోళన అవిశ్రాంతం కలుగుతుంది. ఈ రకమయిన సంస్కారాల నుండి విముక్తి కలిగినప్పుడు పొందే అనుభవం నిజంగా చాలా ఆనందదాయకంగా ఉంటుంది.

***వివిధ రకాలయిన సంస్కారాలు, వాటి అవస్థానాలు:*** సంస్కారాల స్థాయి అవి సంచరించే ప్రపంచాలను బట్టి మూడు రకాలుగా విభజించవచ్చు. (1) భౌతికపరమయిన సంస్కారాలు (2) సూక్ష్మపరమయినవి (3) మానసికపరమయినవి. ఇవి వాటికి సంబంధించిన ప్రపంచంలో ప్రభావాన్ని కలిగి ఉంటాయి. వీటి ప్రభావం చైతన్యంపై పడుతుంది. అందువలన భౌతికపరమయిన సంస్కారాలు కలిగినవారు భౌతికపరమయిన అనుభవాన్ని మాత్రమే పొందగలరు. ఇదేవిధంగా సూక్ష్మ మానసిక సంస్కారాలకు కూడా వర్తిస్తుంది.

***స్వాత్మానుభూతి పొందిన వారికి సంస్కార ప్రభావం ఉండదు:*** ఈ స్వాత్మానుభూతి పొందినవారు ఇతరత్రా జగత్తులో జీవరాశులతో చాలా తేడా కలిగి ఉంటారు. వీరికి పరమాత్మ అనుభవం తమ చైతన్యం ద్వారా కలుగుతుంది. మిగతా వారికి వారి దేహానికి సంబంధించిన అనుభవం మాత్రమే ఉంటుంది. ఈ సంస్కార రహిత స్థాయికి చేరినప్పుడు మాత్రమే పరమాత్మ నిజతత్వాన్ని గ్రహించడం జరుగుతుంది. అప్పుడు అనంతమయిన, అవిభాజ్యమయిన మూలభూత స్థితిని అనుభవించడం తద్వారా అంతవరకూ చేసిన ప్రయాణం ఫలవంతమవ్వడం సాధ్యమవుతుంది. కనుక ఈ సంస్కారాల బెడద నుండి మనస్సును విముక్తి చెయ్యడం అతి ముఖ్యమయిన విషయం. ***(సశేషం)***





*(గత సంచిక తరువాయి)* **సీరియల్**

# మస్తులు - బాటసారులు

## మస్తుల యాత్రలో సద్గురువు పాత్ర

(ఆధ్యాత్మిక మార్గములో ముందుకు పోయిన జీవాత్మల వివరణాత్మకమైన అధ్యాయము)

ఈ అధ్యాయములోని విష యములు మెహెర్‌బాబా చెప్పిన వాటిపై ఆధారపడి ఉన్నవి. అందులో అధిక భాగము 1946 డిసెంబరులోను - 1947 జన వరిలోను చెప్పబడినవి. మెహెర్ బాబా అక్షర ఫలకము ద్వారా విశదముగ వివరముతో చెప్పిన వానికి ఒక పద్ధతిలో పెట్టి, వివర ములనన్నింటిని సహజమైన ఒక క్రమములో నుంచుటయే నేను చేసిన పని.

దీనికి సంబంధించిన విష యములను బాబా నాకు చెప్పిన తర్వాత, అప్పుడప్పుడు ఆయన మార్గదర్శిత్వము కూడా నాకు లభించు భాగ్యము పొందితిని. మొట్టమొదట చెప్పినప్పుడు నాకు స్పష్టముగా తెలియని విషయములలో తర్వాత బాబా ఎక్కువ విషయములను - చివరకు - ప్రతి అధ్యాయములోని ప్రతి విషయమును - స్వయముగా ఆయనే చూచెను. అందుచేత ఈ గ్రంథము యొక్క ప్రస్తుత రూపము దీనిలోని విషయములు - ఆయన తుది దిద్దుబాటులతో గూడినవే.

ఈ విషయము పాశ్చాత్య పాఠకులకు తెలియజెప్పుటలో కొన్ని కష్టములున్నవి. ఆధ్యాత్మి కానుభవముల యొక్క వివిధ దశలను తెల్పుటకు - వివిధ రకముల మస్తులను (భగవదోన్మ త్తులు) తెల్పుటను ఆధ్యాత్మిక మార్గములోనున్న జీవాత్మల వివిధ స్థితులను తెల్పుటకు తగిన పదములు ఆంగ్ల భాషలో చాలా తక్కువగా ఉన్నవి. మస్తులను మాటకు తగిన ఆంగ్ల పదము లేనేలేదు. అందువల్ల సూఫీ వేదాంతములకు చెందిన పదములను తప్పనిసరిగా ఉపయోగింప వలసి వచ్చినది. అయినప్పటికిని ఇంత మహత్తరమును, క్లిష్టమునైన విషయమును తెలియ చెప్పుటలో బాబా పద్ధతి సులభముగా అర్థము చేసికొనుటకు వీలుగానుండును.

మొదట ఆధ్యాత్మికముగ పురోగమించిన జీవాత్మలను ఆయన అయిదు తరగతులుగా విభజించును.

1. భగవంతునిలో లీనమైనవారు - భగవదైక్యము చెందినవారు.
2. భగవదోన్మత్తులు
3. సర్వకాలములందు అప్రయత్నముగ భగవచ్చింతనలో నుండు (God absorbed) వారు.

● ఈ అధ్యాయము శ్రీ నండూరి వెంకట కృష్ణమాచారి, ఎమ్.ఏ., ఎల్.ఎల్.బి. గారిచే అనువదింప బడినది.

4. ప్రయత్న పూర్వకముగ భగవచ్చింతనలో నుండువారు (Gods communed)

5. భగవచ్చింతనలో మైమరచినవారు. (God-mad-God-merged.

**1. భగవదైక్యము చెందినవారు:** భగవదైక్యము చెందినవాడు సప్తమ స్థానములోనున్న భగవదోన్మత్తుడు, పునర్జన్మ లేనివాడు, భగవంతునిలో మునిగిపోయినవాడు. ఆతనిలోని 'నేను' అనునది – లేక అహంకారము పూర్తిగా నాశనమైనది. అనంతానందములోను – అనంత శక్తిలోను, అనంత జ్ఞానములో నాతడుండును. ఈ లోకము విషయము – తన శరీర విషయము – దిగువ ఆరు స్థానముల విషయము అతనికి స్పృహ ఉండదు. తానే భగవంతుడనన్న విషయమొక్కటే అతనికి తెలియును.

**2. భగవదోన్మత్తులు:** మస్తులందరు భగవదోన్మత్తులే – భగవద్భక్తి (Divine love) వల్లమత్తిల్లినవాడు. గంజాయి, కల్లు, సారా మున్నగు వాటివల్ల మైమరచినవాడు వాని శరీరములోని ధాతువులలో ఎంతవరకు ఆనిషా వస్తువులు దాగి ఉండునో అంతవర కామత్తువల్ల కలుగు ఆనందము ననుభవించగలడు. అతడు ఆనందముగా ఉండును. ఎవరిని, దేనిని లక్ష్యపెట్టడు. భూత భవిషద్వర్త మానము లన్నవాటికి అర్థమే లేనట్టి మత్తులో పడి ఉండును.

కాని ఈ మామూలు నిషా వీడిపోయిన అంతనే త్రాగుబోతు పూర్వపు స్థితికి వ్యతిరేకమైన స్థితిలోకి వచ్చును. అతని మత్తు లేక నిషా తాత్కాలికము. లోక పరిస్థితులు, అతనికున్న ధనము, అతని శరరపాటవము, తాగుడువల్ల అతడనుభవించగలిగిన ఆనందమునకు హద్దుల నేర్పరచును.

మస్తు అనగా భగవదోన్మత్తుడు తన స్థితి యొక్క తీవ్రత ననుసరించి త్రాగుబోతు అనుభవించునట్టి ఇంద్రియానుభూతి ననుభవించును. ఎవరిని సరకుకొనడు. దేనిని లక్ష్యపెట్టడు. కాని వీరిద్దరి నిషాలో భేదమున్నది. మస్తు లేక భగవదోన్మత్తుని నిషా దిగిపోకుండ ఉండును. అది హెచ్చుట జరుగవచ్చును గాని తగ్గుట జరుగదు. దానివల్ల శరీరము మీద గాని, మనస్సు మీద గాని దుష్పరిణామము లేవియు నుండవు. అది శాశ్వతమైనది. శుద్ధమైనదాస్థితి.

శాశ్వతముగా భగవదోన్మత్తత ననుభవించుటయే మస్తు యొక్క ముఖ్యానుభూతి. మత్తు లేక నిషా యొక్క తగ్గుదలను బట్టి తానేస్థితి (plane)లో నున్నది అస్పష్టముగ నాతనికి తెలియ వచ్చుచుండును. త్రాగుబోతుకు కూడా ఆతని నిషాబట్టి కొద్దిగనో గొప్పగానో తన చుట్టుపట్ల జరుగుచున్నది తెలియుచుండును. కాని నిషా ననుభవించుటయే బలవత్తరమైన అనుభూతి యగుటచే ఆతడు దాని విషయమై పట్టించుకొనడు.

*(సశేషం)*





# నన్ను ప్రేమించండి – నన్ను తెలిసికొందురు

–మెహెర్‌బాబా

*అనువాదం: బాలగోపాల భాస్కరరాజు*

**"న**న్ను ప్రేమించండి. నన్ను తెలిసికొందురు; కాని నన్ను తెలిసికొనుటకు మిక్కిలి కష్టమైనంత పరమ సత్యమును నేను. భగవన్నామ జపము అవసరం లేదు. తపస్సు అవసరం లేదు; ధ్యానం అవసరం లేదు. ప్రేమ మాత్రమే అవసరము; అట్టి ప్రేమ నీ అహంకారమును నాశనం చేస్తుంది. అనగా మీ యొక్క ప్రేమ మిమ్మలను ప్రపంచాన్ని మరపించేటంత అగాధమై వుండాలి. ఈ అనుభవం మిమ్మలను నిరాసక్తులను చేసి విభ్రాంతులను కావించి మిమ్మలను అన్యులుగా భ్రమింపచేస్తుంది. ఇది నిజమైన ప్రేమ.

మీరు మీ హృదయములలో అనుభూతిని పొందుతూ వున్నారు. ఈ కారణం చేత మీరు నన్ను తరచుగా పగటివేళ జ్ఞాపకం చేసికొంటూ వుండవచ్చు. కాని నిరంతరాయంగా మాత్రం కాదు. ఈ అనుభూతి గాని, లేక భక్తిగాని, మంచివే కాని, అది ప్రేమ మాత్రం కాదు. దీనిని ప్రేమయని పొరపడకూడదు. ఎందుచేతనంటే – భగవంతుని చూడగలిగే ఆ నిజమైన ప్రేమ, భగవంతుని తెలిసికొనగల్గే ఆ నిజమైన ప్రేమ సృష్టింపబడేది కాదు. అది అనుగ్రహ ప్రదాయిని. సద్గురువు యొక్క అట్టి అనుగ్రహ ప్రదానం. మిక్కిలి అదృష్టవంతులైన ఏ కొలది మందిపైననో వర్షిస్తుంది.

అధైర్య పడకండి. ఆవశ్యకమైనట్టి ఈ ప్రేమ మీకు లేకపోయిననూ నాయందు అగాధమైన అనుభూతి వున్నది. ఎల్లప్పుడును నన్ను జ్ఞాపకం చేసికొనేటందుకు, నన్ను గురించి ప్రసంగించడానికి ప్రయత్నించండి.

సద్గురువు యొక్క అనుగ్రహమును స్వీకరించడానికి కృతనిశ్చయులై వుండడము అది చక్కని ప్రారంభ దశ. ఇదే స్థితి కొనసాగినట్లయితే నా యొక్క ప్రేమ ప్రదానమనే కాన్కను స్వీకరించే అదృష్టశాలురు అయ్యే ఒకానొక రోజు వస్తుంది. మీ హృదయములలో ఈ అనుభూతిని శాశ్వతం చేయడానికి, దానిని పెంపొందింప చేయడానికి ఇంకా ఇంకా గంభీరతను కల్గించడానికి సంసిద్ధులై వుండండి.

ఎట్లు ప్రారంభించాలి? ఏ కార్యమునైనను ప్రారంభించే ముందు, ముగించే ముందు నన్ను జ్ఞాపకం చేసికొనండి. ఏ పనినైనను చేసేముందైనను సరే నన్ను గురించి చింతన చేయండి. మీరు ఏదైనా వ్రాయదలచుకొన్నపుడు ప్రారంభించే ముందు నన్ను జ్ఞాపకం చేసికొనండి. అంతట "బాబా! దీనిని నీవే వ్రాస్తున్నావు, నేను వ్రాయుటలేదు" అని మనస్సులో తలచండి.

నేను ప్రేమార్ద్రుడనైన దివ్య ప్రియతముడను. ఎందుచేతనంటే – నేనే ప్రేమను కాబట్టి. ఈ కారణం చేత నన్ను ప్రేమించేవారు అపరిమితమైన దృష్టితో ఆశీర్వదించబడి నా యదార్థ స్వరూపమును చూస్తారు.

●

# డాన్ ఆకస్మిక పర్యటన

## (మా ప్రతినిధి)

**గా**డ్‌స్పీక్స్, డిస్కోర్సెస్ గ్రంథాల సంపాదకునిగా బాబా ప్రేమికులందరికీ పరిచయమున్న డాన్–ఇ–స్టీవెన్సు శనివారం సాయంత్రం (సెప్టెంబర్ 3) కోఠి సెంటర్‌లో, ఆదివారం ఉదయం (సెప్టెంబర్ 4) జూబ్లిహిల్స్ సెంటర్‌లో బాబా ప్రేమికుల నుద్దేశించి ప్రసంగించారు. కోఠి సెంటర్‌లో మాట్లాడుతూ ఔరంగాబాద్‌కు సమీపంలోని ఎల్లోరా దగ్గర గల కైలాస కోవెలలో మెహెర్‌బాబా తాను ఏకాంతవాసం చేసిన స్థానంలోనే తనను మూడు రోజులపాటు ఒంటరిగా వుండమని ఒక సందర్భంలో ఆదేశించారని డాన్ చెప్పారు. తనతోపాటు సో॥ ఏరుచ్‌ని కూడా ఇచ్చి పంపారని, మెహెర్‌బాబా ఏకాంతవాసంలో ఉండగా – ఆ ప్రదేశానికి ఆవల కాపలాగా ఏ రీతిలో ఏరుచ్ నిల్చునుండేవాడో – తనకూ ఆ సదుపాయం అవతారుడు కల్గజేశాడని డాన్–ఇ–స్టీవెన్స్ వివరించారు. అవతారుని ఆగమనం – మానవాళి ఉద్దరణకేనన్న సందేశంతో – అవతారునితో డాన్‌కు గల సన్నిహిత సంబంధాన్ని – ఆనాటి తన మధుర స్మృతులను మృధు మధురంగా ఆయన చెప్పారు. డాన్ కంఠం విలక్షణంగా వుంటుంది. ఈ సంగతి – ఆయనతో పరిచయమున్న వారందరికీ తెలుసు. బిబిసి రేడియో వ్యాఖ్యాతలను పోలి డాన్ కంఠం వుంటుందని సాక్షాత్తూ అవతారుడే ఆయన్ని పలుమార్లు అభినందించారు. మెహెర్‌బాబా ఆదేశాల మేరకు అవతారుడు పర్యటించిన మన దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు డాన్ పర్యటించి వీడియో చిత్రీకరణ చేశారు. అవతారుడు మస్తుల సాంగత్యం కోసం పర్యటించిన రాజస్థాన్‌లో గల మౌంట్ అబూ, దిల్వారా జైన్‌ల దేవాలయాలు, అజ్మీరు – ఢిల్లీ సమీపంలోని మహ్మదీయ దర్గాలలో సయితం ఆయన పర్యటించాడు. హైదరాబాద్‌లోని కోఠి సెంటర్‌లో సెప్టెంబరు 3 శనివారం సాయంత్రం జరిగిన సత్సంగ్ కార్యక్రమాల్లో డాన్ ఆయా ప్రదేశాల పర్యటనా సమయంలో తన విశేష అనుభవాలను, అనుభూతిని చక్కగా వివరించారు.

అయితే, ఈ డాన్– ఇ–స్టీవెన్స్ హైదరాబాద్ విచ్చేసినా ఆయన వస్తున్నట్లు స్థానిక బాబా ప్రేమికులకు ముందుగా తెలియదు. బహుశా – ఆకస్మిక పర్యటనగా డాన్ – హైదరాబాద్‌కు వచ్చారని – కొందరు బాబా ప్రేమికులు భావించారు. అవతారునితో డాన్‌కు విశేష సాన్నిహిత్యం వుంది. అవతారుని ఆధ్యాత్మిక గ్రంధాలను ఆసాంతం ఆకళింపు చేసుకున్న విశిష్ట వ్యక్తి డాన్. ఎనిమిదిపదుల వయస్సులో ఎంతో శ్రమ కోర్చి హైదరాబాద్‌కు ఆయన వచ్చారు. డాన్ పర్యటన గురించి పలువురికి తెలియక పోవడం వల్ల – ఆయన మాటలు నేరుగా వినే భాగ్యం చాలామంది తెలుగువారు కోల్పోయారని పలువురు బాబా ప్రేమికులు వాపోయారు.

***డాన్–ఇ–స్టీవెన్స్ హైదరాబాద్‌లోని కోఠి సెంటర్‌లో సెప్టెంబర్ 3న చేసిన ప్రసంగ సారాంశం అక్టోబర్, 2005 సంచికలో ప్రచురించగలం.*** ●





# సెప్టెంబరు 7

**నే**ను ఉన్నతోన్నతుడను (The Highest of the High) అని మెహెర్‌బాబా ఒక సందేశాన్ని 1953 సెప్టెంబరు 7న డెహ్రాడూన్‌లో ప్రకటించారు. 2003 సెప్టెంబరు 7న డెహ్రాడూన్‌లో పెద్ద ఎత్తున్న ఈ మేరకు స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

1953 నాటి సంఘటనలను గుర్తు చేస్తూ, ట్రస్టు ఛైర్మన్ భావూజీ ఒక సందేశం పంపుతూ 1953 ప్రాంతంలో మెహెర్‌బాబా డెహ్రాడూన్‌లో ఏకాంతవాసంలో ఉన్నారన్నారు. కేవలం కిషన్ సింగ్ (డెహ్రాడూన్‌లో వుంటున్న బాబా ప్రేమికుడు) మాత్రం బాబాను దర్శించుకునే అవకాశం ఇచ్చారు. ప్రజానీకానికి 'తాను డెహ్రాడూన్' వదలి వెళ్ళేలోగా ప్రజాదర్శనం ఇస్తానని బాబా చెప్పారు. ఐతే, కిషన్ సింగ్ కోరిన మాదట ఒకే ఒకవ్యక్తికి అతని భార్య మతిస్థిమితం లేక బాధపడుతుంటే, అతని బాధ చెప్పుకోవడానికి మాత్రం బాబా తన దర్శనం ఇచ్చేందుకు అంగీకరించారు. బాబా తన నామం 40 రోజులపాటు నిరంతరం ఆపకుండా జపించమని ఆజ్ఞాపించారు. అయితే, ఆవ్యక్తి బాబా ఆజ్ఞను పాటించ లేదని ఆ తర్వాత రోజుల్లో తెలుస్తుంది. అలా తెలిసిన రోజు 1953 సెప్టెంబరు 7. ఆరోజుననే మెహెర్ బాబా ఈ సందేశం ఇచ్చారని భావూజీ తాను పంపిన సమాచారంలో పేర్కొన్నారు. ఈ సందేశం చాలా ముఖ్యమైందని బావూజీ గుర్తుచేశారు. బాబా తన సందేశంలో :–

**"I am either Highest of the High or I am lowest of the low, but I am not in-between the states. If I am the Highest of the High, there is nothing for you to ask Me. I know what you need and without asking, I give. But if I am the lowest of the low and you ask Me for anything, thousands of times, it will be of no use. I cannot give you. So if I am Highest of the High, there is nothing for you to ask. I give you without your asking, but because I am not in the middle state, I connot give anything to you. Anyway, you have to leave everything to Me. It depends upon you, what you take Me for, but I tell you the Truth, that I am either the Highest of the High or lowest of the low. I am not any Mahatma, Sat Purush, Yogi, or like this."**

మధురమైన బాబా సందేశాన్ని మనం ఎల్లవేళలా గుర్తుంచుకుందాం అని భావూజీ అన్నారు.

# రాజాం

సెప్టెంబరు 4వ తేదిన రాజాం సెంటర్‌లో మెహెర్ ప్రేమిక సహవాస్ ఘనంగా జరిగినట్లు శ్రీ గౌరు మెహెర్ ప్రసాద్ ఒక ప్రకటనలె తెలిపారు

# ఉన్నది నీవు మాత్రమే

*–శ్రీమతి కె.గౌరీకుమారి, హైదరాబాద్*

*మూలం: మెహెర్‌బాబా*

**అ**వతార్ మెహెర్‌బాబా ఒక సందర్భంలో తన ప్రసంగములు – 'డిస్కోర్సెస్'లో చెప్పిన 'ఉన్నది నీవు మాత్రమే' – అనే విషయం గురించి దయచేసి పరిశీలించండి.

నీవు నిద్రలో ఉన్నప్పుడు కలగంటావు. ఆ కలలో మనుషులతో కలసి తిరుగుతావు. వారితో సంభాషిస్తావు. వారితో కలసి మెలసి పనిచేస్తూ వుంటావు. వాటికి సంబంధించిన సంతోషాన్ని, దుఃఖాన్ని అనుభవిస్తావు. ఈ కలలో నీవు చూసిన మానవులు, వస్తువులు ఎక్కడ నుండి వచ్చాయి? అవి బయట నుండి రాలేదు. నీ లోపలి నుండే వచ్చాయి. నీవు అనుభవించడం కోసం నీవే వీటన్నిటినీ సృష్టించుకున్నావు. కలలో అన్నిటినీ చూసేది నీవే. ఇంకెవరూ చూడటం లేదు. నీవు మాత్రమే చూస్తున్నావు. ఈ కలలో మనుషులను, వస్తువులను, విషయాలను, చర్యలను నీవే సృష్టించుకొని, నీవే చూసుకొని నీవే అనుభవిస్తున్నావు. కలలోని విషయాలన్నీ నీ కోసమే ఉనికిని పొందుతున్నాయి.

ఇదే విధంగా నీవు మెలుకువ స్థితిలోనున్నప్పుడు కూడా నీ చుట్టూ ఉన్న వస్తువులను, మనుషులను చూస్తున్నావు. కలలో మాదిరిగానే ఇక్కడ కూడా నీవే చూస్తున్నావు. ఇంకెవరూ చూడటం లేదు. చూసిన దాన్ని చూసినట్లు అనుభవిస్తున్నావు. అంటే నీవు వాటిని ఎలా చూస్తున్నావో, ఎలా అనుభవిస్తున్నావో అలాగే చూస్తున్నావు, అలాగే అనుభవిస్తున్నావు. ఇవన్నీ నీ కోసమే ఉన్నవి.

నీ నుండే వస్తున్నవి. బయట నుండి ఎక్కడ నుండీ రావడం లేదు. నీవు అనుభవించడానికి వాటిని సృష్టించుకొంటున్నావు. నీ మనస్సుతో కల్పన చేసుకొంటున్నావు. నీ సృష్టంతా నీ మనస్సు నుండే బయటకు వస్తున్నది. అంటే నీ వుంటేనే నీ ప్రపంచమున్నది. ఎలాగంటే ఈ ఉదంతం చూడండి.





ఒక ఎండుటాకు నీటి ప్రవాహంలో కొట్టుకొని పోతున్నది. ఆకు మీద ఒక చీమ కూడా ఉంది. చీమ సురక్షితంగా ఆకుమీద వుండి ప్రయాణం సాగిస్తున్నది. నీటి ప్రవాహం ఒరవడికి ఆకు తల్లక్రిందులైంది. చీమ నీటిలో మునిగిపోతున్నది. "రక్షించండి, రక్షించండి నా ప్రపంచం మునిగిపోతున్నది" అని గట్టిగా అరవసాగింది చీమ. ప్రక్కనే ఉన్న ఒక కప్ప చీమ మాటలు విని "ఇదేమిటి? మునిగిపోతున్నది నీవు కదా! ప్రపంచం మునిగిపోతున్నదంటున్నావేమిటి?" అన్నది చీమతో. నేను మునిగిపోతుంటే నాతోపాటు నా ప్రపంచం కూడా మునిగిపోతున్నది. నేనుంటేనే నాకు నా ప్రపంచమున్నది. నేను లేకుంటే నా ప్రపంచం నాకు లేదు" అన్నది చీమ.

నీవు నిద్రపోకుండా ఉన్నప్పుడు మెలుకువ స్థితిలో ఉంటావు. నీ మెలకువ తాలూకు నిత్య జీవితంలో అనేకమందితో కలసి జీవించి, అనేక అనుభవాలను పొందుతూ ఉంటావు. ఇది కూడా కలగనడం మాత్రమే. నీవు అనుభవించడానికి అనేకమంది మనుషులు, వస్తువులను మెలకువ అనే కలలో కూడా సృష్టించుకుంటున్నావు. నీవు నిద్రలో గన్న కల కూడా మెలకువగా ఉండి కంటున్న కలలో మరొక కల.

నిద్రలో కలగంటూ నీవు మెలకువ అనే కలలో మేల్కొనగానే నిద్రలో వుండి గన్న కల కేవలం కలేనని గుర్తిస్తావు. కలలోని విషయాలు నిజం కాదని గ్రహిస్తావు. అలాగే నీవు మెలకువ అనే కల నుండి మేల్కొన్నప్పుడు ఈ కలలు రెండింటికీ సృష్టికర్తవు నీవేనని గ్రహిస్తావు. సమస్త మానవులు, వస్తువులూ, పరిస్థితులూ నీవు సృష్టించుకున్న సృష్టిలోనే వున్నవని గ్రహిస్తావు. అవన్నియు నీలోనే ఉన్నవి. కేవలం నీ కోసమే ఉన్నది. అవి నీవు కలలో పొందిన అనుభవములు మాత్రమేననే సత్యాన్ని గమనిస్తావు. ఎలాగంటే–

ఒక అడవి పక్షి ఎగిరి ఎగిరి ఒక భవంతిలో ప్రవేశించింది. అక్కడ ఒక అద్దం ఉంది. పక్షి అద్దం దగ్గరకు వచ్చింది. అద్దంలో మరొక పక్షిని చూసింది.

అద్దంలోని పక్షి నిజం పక్షి యొక్క నీడ మాత్రమే. దాని ప్రతిబింబం మాత్రమే. అద్దంలో ఉన్నది తన ప్రతిబింబమని తెలియక అది మరొక పక్షియని భ్రమించి మోసపోయింది. నిజం పక్షి అద్దంలో ఉన్న పక్షిని ముక్కుతో పొడవసాగింది. అదే మాదిరిగా అద్దంలో ఉన్న అసత్యపు పక్షి కూడా పొడవసాగింది. ఇలా పొడిచి పొడిచి నిజం పక్షి అలసిపోయింది. కానీ అద్దంలో పక్షి తన నీడ మాత్రమే అనే నిజాన్ని గ్రహించలేకపోయింది.

నిజం పక్షి అసత్యపు పక్షితో పోరాడి, పోరాడి పూర్తిగా అలసిపోయింది. ఈలోగా అద్దం కూడా పగిలిపోయింది. అద్దం పగిలిపోగానే అసత్యపు పక్షి మాయమైపోయింది. ఇక మిగిలింది నిజం పక్షి మాత్రమే. ఉన్నది 'నేను మాత్రమే' అనే అనుభవముతో కూడిన నిజస్థితిని పొందింది.

నీవు మెలకువ అనే కల నుండి మేల్కొన్నప్పుడు నిజంగా వున్నది నీవు (పరమాత్మలోని ఆత్మ) మాత్రమేననే అనుభవాన్ని పొందుతావు.

నిజమైన వెలుగును పొందగానే నీవు వెలుగు అని భ్రమించే యీ చీకటి మాయమగును. ●

# మామాటలు

## ఎవరి సంగతి ఏమోగాని నాకు మాత్రం

**'మె**హెర్‌బాబా' మాసపత్రిక వారు ఫోటో వ్యాఖ్యకై అని ఇచ్చి మీ సమాధానం వ్రాయండి అని కోరారు. 'బాబా'ను పుస్తకంలోచూచినప్పటి నుంచి ఈ ఫోటోలోని బాబా ఎక్కడ వున్నారు. బాబా మండలిలో వున్నారా? ఆంధ్రాలో వున్నారా? గురుప్రసాద్‌లో వున్నారా? అక్కడనా? ఇక్కడనా? ఇదేప్రకారంగా రోజంతా 'బాబా – బాబా' గురించే ఆలోచిస్తోంది మనస్సు. 'మెహెర్‌బాబా' పుస్తక సంపాదకులు ఇలాగే ప్రతి మాసపత్రికలో ఇలాంటి చిత్రపటం వేస్తుంటే, ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని 'బాబా' నామస్మరణ ఎల్లప్పుడు చేసుకునేలాగా చేస్తున్నందులకు ధన్యవాదాలు. మా కదిరి అవతార్ మెహెర్‌బాబా సెంటర్ తరపున మా ధన్యవాదాలు తెలపుకుంటూ... **–జయం లక్ష్మీగోపాల్**

## శ్రీకాకుళం సెంటర్ 44వ వార్షికోత్సవం

**అ**వతార్ మెహెర్‌బాబా శ్రీకాకుళం కేంద్రం 44వ వార్షికోత్సవం ఆగస్టు 22 ఆదివారం చక్కని ప్రేమ వాతావరణంలో కడు రమ్యంగా జరిగింది. ఉదయం 5.45 గంటలకు నగర సంకీర్తన బాబా చిత్రపటంతో పురవీధులలో సుమారు వంద మంది ప్రేమికులతో ఊరేగింపు జరిగింది. 8.30 గంటలకు సప్తవర్ణ పతాకావిష్కరణ సో॥ ఎస్.వి.శ్రీరామమూర్తిగారు, ప్రిన్సిపాల్, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల గావించగా, సో॥ తిరుపతి శర్మ పతాక విశిష్టత గురించి వివరించారు. సో॥ శ్రీరామమూర్తిగారు తాను చిన్నతనం నుంచి మెహెర్‌బాబా కేంద్రం పక్కనే నివాసమున్నప్పటికి మొట్టమొదటగా ఈరోజే ఈ భవనంలోకి అడుగుపెట్టానని, ఎంతో ఆనందంగా వుందని, ఈ నాటికి బాబా తనను అనుమతించారని, ఇకపై అన్ని కార్యక్రమాలలో పాల్గొంటానని అన్నారు.

**–పి.వి.కె.ప్రసాదరావు**, *శ్రీకాకుళం*

## నిర్యాణం

**యా**దవోలు నివాసి తాడేపల్లి పాపారావు (95) గారుచాలా కాలం బాబా వారితో సన్నిహితంగా వున్నారు. ది.5.8.2005 ఉదయం 5 గంటలకు బాబాలో ఐక్యమైనారు. వారి ఆత్మకు శాంతి ప్రసాదించాలని కోరుతూ కుమారుడు తాడేపల్లి మెహెర్‌బాబా, కోడలు పాటేశ్వరి ప్రార్థనలు చేశారు.

**–టి.మెహెర్‌బాబా**, *యాదవోలు*

## కదిరి సెంటర్‌లో ఉచిత నేత్ర చికిత్సా శిబిరం

**ఆ**గస్టు 28 ఆదివారం నాడు కదిరి అవతార్ మెహెర్‌బాబా సెంటర్ (వేమారెడ్డి సర్కిల్) వారి సహకారంతో ధర్మవరం లయన్స్ కంటి ఆసుపత్రి వారిచే కదిరిలో బీదలకు ఉచిత నేత్ర శస్త్ర





చికిత్సా శిబిరం నిర్వహించి 140 మందికి చికిత్స చేసి, అందులో 65 మందికి శస్త్ర చికిత్స లయన్స్ క్లబ్ వారి బస్సులో ఉచితంగా ధర్మవరం అవతార్ మెహెర్‌బాబా సెంటర్ వారు పిలుచుకుని వెళ్ళి ఆపరేషన్ చేసి తిరిగి కదిరికి చేర్చి, బాబా దర్శనం చేసుకొని ఎంతో సంతోషంతో వెళ్ళారు. బాబా దయతో అందరి ఆపరేషన్లు విజయవంతమయ్యాయి.

**–పి.హరినాథ్ గుప్తా,** ఉపాధ్యక్షులు, కదిరి సెంటర్

## విజయవంతమైన ముప్పాళ్ల సెంటర్ సహవాస్

**ము**ప్పాళ్ల సెంటర్ సహవాస్ గురించి 'మెహెర్‌బాబా' పత్రికలో చదివి ఎక్కువ మంది సహవాస్‌లో పాల్గొన్నారు. ఇతర సెంటర్ల నుంచి దాదాపు 250 మంది, ముప్పాళ్ల సెంటర్ తరపున 200 మంది కలిపి మొత్తం 450 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుబ్బలక్ష్మి (విజయవాడ), బాలగోపాల భాస్కరరాజు (తాడేపల్లిగూడెం), బి.రామకృష్ణయ్య (హైదరాబాద్) ఉపన్యసించారు. సభకు యాగంటి సుబ్బయ్య అధ్యక్ష వహించి చక్కగా నడిపారు. విశాఖ నుంచి రాజు, మెహెర్‌బాబా నాటిక బృందం, భైరమంగళం నుంచి వెంకోబరావు, బెంగుళూరు నుంచి రాజగోపాల్, సుబ్రహ్మణ్యం తదితరులు వచ్చారు. వచ్చినవారంతా అమితానందం అనుభవించినట్లు ఆనందంగా చెప్పారు.

**–కాకుమాను రాధాకృష్ణమూర్తి**

## రాయపూర్‌లో మెహెర్‌బాబా ప్రత్యేక సమావేశాలు

**ఆ**గస్టు 3 బుధవారం సో॥ త్రినాథ రథో భిలాయ్ రాక సందర్భంగా రాయపూర్‌లో సో॥ వర్మ, అవతార్ మెహెర్‌బాబా కేంద్రం కార్యదర్శి వారి గృహమందు బాబా సమావేశాన్ని సాయంత్రం 6–9 గంటల వరకు ఏర్పాటు చేయడమైంది. బాబా ఆరతి, ప్రార్థన అనంతరం సో॥ రథో ఈ మహాయుగావతారి మెహెర్‌బాబా అవతరణ విశిష్టతను పేర్కొంటూ సృష్టి మర్మాన్ని, చైతన్య వికాసాన్ని వివరించిన గాడ్ స్పీక్స్ గ్రంథాన్ని, జీవిత లక్ష్యం చేర్చే ప్రేమను, తదానుభూతుల్ని కొన్నిటిని సోదాహరణంగా పేర్కొంటూ కొవ్వూరు మెహెరస్థాన్, గుంటూరు బాబా కేంద్ర స్థాపన విశేషాల్ని పేర్కొన్నారు. సర్దార్ దర్శనసింగ్ హన్సపాల్ రథోగారి ఇంగ్లీషు ప్రసంగాన్ని హిందీలో అనువదించారు.

జూలై 4న ఉదయం శబరీ ఆశ్రమాన్ని దర్శించి అక్కడి వారిని ఉద్దేశించి గతంలో రాయపూర్ కలెక్టర్ శ్రీ కేరావలా గారి ఆహ్వానంతో బాబా రాయపూర్ శివారులో నున్న పవిత్ర పర్వత గుహలో కొన్నాళ్లు ఏకాంతవాసాన్ని గడిపిన ఉదంతం గుర్తుచేశారు.

## చల్లపల్లి సెంటర్‌లో విశేష కార్యక్రమాలు

**చ**ల్లపల్లి అవతార్ మెహెర్‌బాబా సెంటర్‌లో ఆగస్టు 7, 13, 14, 19, 21, 28 తేదీలలో పలు విశేష కార్యక్రమాలు నిర్వహించినట్టు పి.వి.రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

## వెయ్యి రూపాయలు - జీవిత సభ్యత్వం
## 2005 ఏప్రిల్ 14 నుండి మే 12 వరకు పంపిన వారి వివరాలు

| నెం. | తేది | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | 10.08.2005 | శ్రీ ప్రసాద్ రావు పి.వి.వి, విజయనగరం | రు. 500.00 |
| 2. | 18.08.2005 | శ్రీ కోటేశ్వర్ రావు, విజయనగరం | రు. 500.00 |
| 3. | 18.07.2005 | శ్రీ సుబ్రమణ్యం జి.ఎస్.ఎస్.వి,విజయనగరం | రు. 500.00 |
| 4. | 18.07.2005 | శ్రీ రమణ మూర్తి. కె.వి. విజయనగరం | రు. 500.00 |
| | | **మొత్తం** | **రు. 2,000.00** |

## ఉచిత దుస్తుల పంపిణీ

**శ్రీ**మతి - శ్రీ కొడుకుల వెంకట్రావుగారు, వారి కుటుంబ సభ్యులు కృష్ణభగవాన్ ప్రేమికులు శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా అవతార్ మెహెర్‌బాబా ప్రేమాశ్రం ఫ్రీ ఎలిమెంటరీ స్కూలులోని పేద విద్యార్థులకు ఉచితంగా దుప్పట్లు, తువ్వాళ్ళు, సిబ్బందికి చీరలు, టీచర్లకు చుడీదార్లు పంపిణీ చేశారు. శ్రీ బి.నరసింహమూర్తి, శ్రీ ఐ.రామారావు, శ్రీ రమణయ్య, శ్రీ భాస్కరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విశాఖ శాటిలైట్ సిటీ రోటరీ వారు విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫారాలు అందజేశారు. ఇకముందు కూడా స్కూలుకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేస్తామని రోటరీ సంస్థ వారు ప్రకటించారు.

**-ఐ.రామారావు**, కార్యదర్శి

## వివాహం

**ఆ**గస్టు 27 శనివారం ఉదయం గం. 11-51 ని.లకు చి॥ల॥సౌ॥ లావణ్య (పద్మజ), చి॥ నరేశ్‌ల వివాహం సిరిసిల్లలో ఏర్పాటు చేసినట్లు సామల రాంప్రసాద్ ఆహ్వానం పంపారు.

## వివాహం

**ఆ**గస్టు 28 ఆదివారం ఉదయం గం. 11-46 ని.లకు చి॥ శ్రీధర్, చి॥ల॥సౌ॥ శ్వేతల వివాహం టిటిడి కళ్యాణ మండపం, పులాంగ్ చౌరస్తా, అంబేద్కర్ విగ్రహం దగ్గర, నిజామాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు చింతల సావిత్రి-జనార్దన్‌లు వివాహ ఆహ్వాన పత్రిక పంపారు.

## ఉపాధ్యాయ దినోత్సవం

**అ**వతార్ మెహెర్‌బాబా ప్రేమాశ్రమం ఉచిత ప్రాథమిక పాఠశాలలో 5.9.2005న సోమవారం ఉపాధ్యాయ దినం వైభవంగా జరుపబడింది. ఈ కార్యక్రమానికి శ్రీ నారాయణస్వామి అధ్యక్షత వహించారు. కార్యదర్శి ఐ.రామారావు ఉపాధ్యాయదినం ప్రాముఖ్యత వివరించారు.





# ఫోటో వ్యాఖ్య

ఈ క్రింది ఫోటోలోని వివరాలు మీకు తెలిస్తే అక్టోబరు 5వ తేదిలోగా మెహర్ మాస పత్రిక పోస్టు కార్డు పై 2005 సెప్టెంబరు - ఫోటో వ్యాఖ్య అని వ్రాసి పంపగలరు పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొనండి.

-ఎడిటర్

2005 ఆగస్టు సంచికలోని ఫోటోవ్యాఖ్యకు సరైన సమాధానం:-

1949 జూన్ 21వ తేదీన మెహెరాజాద్‌లో మెహెర్‌బాబా కోసం కాలేమామ భగవద్గీత చదివి వినిపిస్తున్నారు. (కాలేమామ గురించి క్లుప్తంగా ఈ సంచికలోని 12-17 పేజీలలో పరిశీలించండి.

***సరైన సమాధానం పంపినవారు:*** **శ్రీ బి.లక్ష్మణదాసు**

డోర్ నెం. 28-206-80, ఎస్.ఎన్.పి.కాలనీ, పార్వతీపురం

***పాల్గొన్నవారు:*** **జయం లక్ష్మీగోపాల్**, కదిరి., **శ్రీమతి ఎం.వి.రాజేశ్వరి**, బొబ్బిలి **శ్రీ ఆర్.రామచంద్రరావు**, హైదరాబాద్ **శ్రీ మానేపల్లి రెడ్డియ్య**, జంగారెడ్డిగూడెం,